శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## ఆస్పత్రిలో కాన్పుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలి



**కోవూరు, మే 10 ప్రభాతవార్త :** ప్రభుత్వ ఆస్పత్రుల్లో మహిళల కాన్పులకు సంబంధించి ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రపంచ బ్యాంక్ కన్సల్టెంట్ ఎం.. గణేష్ తెలిపారు. కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాన్పులకు సంబంధించి నర్సులు ఎటువంటి తీసుకోవాలో ఈ సందర్భంగా ఆయన వివరించారు. కాన్పుకు వచ్చిన మహిళలకు ఏయే జాగ్రత్తలు తీసుకోవాలి.. ఒక వేళ రక్తం అవసరం అయితే ఏ విధంగా స్పందిస్తారు.. కాన్పు కష్టమైన పరిస్థితిలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకుంటారని ఆయన నర్సులను ప్రశ్నించారు. మార్చి , ఏప్రిల్ నెలకు సంబంధించి ఈ ఆస్పత్రిలో సాధారణ కాన్పులు ఎన్ని జరిగాయి.. అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. కాన్పుల విషయంలో ఒకవేళ హైరిస్క్ ఏరనపడితే దానికి సంబంధించి ఒక ప్రత్యేక రిజిస్టర్ ఏర్పాటు చేయాలని సూచించారు. మహిళల కాన్పుకు సంబంధించి వాడే యాంటీబయాటిక్స్ వివరాలను కేస్ షీట్‌లో నమోదు చేయాలన్నారు. అనంతరం ఆయన ల్యాబ్‌లో జరుగుతున్న రక్త పరీక్షలకు సంబంధించి నిశితంగా పరిశీలించారు. ప్రతి రోజూ బ్లడ్ గ్రూపుకు సంబంధించి ఎటువంటి కేసులు వస్తున్నాయి.. వాటిని రిజిస్టర్‌లో నమోదు చేస్తున్నారా అనే విషయాలను కూడా ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టరన కె. విజేత, వైద్యులు ఫార్మాసిస్ట్, హెడ్ నర్సు, తదితరులు ఉన్నారు.

## కృత్రిమ గర్భధారణను సద్వినియోగం చేసుకోవాలి



**కోవూరు, మే 10 ప్రభాతవార్త :** జిల్లాలో పాల వెల్లువను మరింత పెంచేందుకు గానూ పాడి రైతులు కృత్రిమ గర్భధారణను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ ఎం. మహేశ్వరుడు అన్నారు. కోవూరులోని డీఎల్‌డీఏ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ ఉచిత గర్భధారణకు సంబంధించిన వీర్య నాళికలను రైతులకు ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని పాడి రైతులు ఉపయోగించుకోవాలన్నారు. అదేవిదంగా జిల్లాలో 600 మెట్రిక్ టన్నుల టీఎంఆర్, 130 టన్నుల పశు గ్రాస విత్తనాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. జిల్లాలోని రైతు భరోసా కేంద్రాల ద్వారా వీటిని ఆయా ప్రాంతాల రైతులకు అందజేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా జిల్లాలోని అన్ని రైతుభరోసా కేంద్రాల్లో ప్రతి బుధవారం పాడి రైతులకు పశు విజ్ఞాన బడులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అదేవిధంగా రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా పెయ్యదూడల పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందని పాడి రైతులు ఇటువంటి మంచి అవకాశాన్ని వారు పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలన్నారు. అదేవిధంగా రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా డీఎల్‌డీఏ సహకారంతో మేలుజాతి దూడలను అందజేయడం జరుగుతుందని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. ప్రధానంగా జిల్లాలో పాడి పరిశ్రమను ఘననీయంగా అభివృద్ధి చేయడమే దీని ప్రధాన లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీఏ ఎగ్జిక్యూటివ్ అదికారి డాక్టర్ సోమయ్య, డైరెక్టర్లు మల్లికార్జున్‌రావు, రమణయ్యలు ఉన్నారు.

## సమస్యలపై స్పందించని కార్యదర్శులకు షోకాజ్‌లు జారీ

**నెల్లూరు కార్పొరేషన్,మే10,ప్రభాతవార్త** స్పందన వేదిక సమస్యల పరిష్కారాలను సూచించిన ప్రక్రియలో పూర్తి చేయని నెల్లూరు నగరపాలక సంస్థ పరిధి లోని కోనేటిమిట్ట రాజా వారి వీధి సచివాలయాల వార్డు ప్లానింగ్ అండ్ రెడ్యులేటరీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేయమని డిప్యూటీ కమిషనర్ చెన్నుడు బుధవారం ఆదేశించారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించిన సమస్యలకు స్పందన వేదిక ద్వారా పరిష్కారం అందలేదని భావిస్తూ జిల్లా ఆడిట్ విభాగం సమస్యను రీఓపెన్ చేశారు. స్పందన విధుల్లో ఆలసత్వం వహించిన సంబంధిత కార్యదర్శులపై నగరపాలక సంస్థ తగిన చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.

## ముఖ్యమంత్రి కావలి పర్యటన ఖరారు

**కావలి, మే 10 ప్రభాతవార్త** ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కావలి పర్యటన ఖరారైనట్లు బుధవారం రాత్రి అధికారులు తెలిపారు. ఈ నెల 12వ తేది ఉదయం 9.35 గంటలకు తాడేపల్లి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరిన ముఖ్యమంత్రి 10.30 గంటలకు కావలి జెడ్పీ బాలుర పాఠశాల క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారని తెలిపారు. అక్కడ ప్రజాప్రతినిధులను కలిసిన అనంతరం కావలి ఉదయగిరి రోడ్డులోని మున్సిపల్ మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొంటారన్నారు. 22ఎ నిషేధిత జాబితా నుంచి చుక్కల భూములను తొలగించి రైతులకు పూర్తి హక్కులు కల్పించే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంటకు కావలి నుండి హెలికాప్టర్‌లో సియం తాడేపల్లికి వెళ్తారని అధికారులు పర్యటన వివరాలు విడుదల చేశారు.

## కావలి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం తనిఖీ



**కావలి, మే 10 ప్రభాతవార్త** కావలి పట్టణంలోని కావలి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సొసైటీ కార్యాలయాన్ని జిల్లా సహకార శాఖ అధికారి సుధాభారతి తనిఖీ చేశారు. సొసైటీ కార్యాలయంలో వున్న దస్త్రాలు పరిశీలించారు. నగదు పుస్తకాలు, రుణాలు తదితర దస్త్రాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. సొసైటీ అభివృద్ధికి డిపాజిట్లు సేకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఛైర్మన్ రేమాల వెంకట్రామిరెడ్డి, సిఇవో వెంకటేశ్వర్లు, కావలి సబ్ డివిజనల్ ఆఫీసర్ యం.వెంకటేశ్వర్లు, ఆడిటర్ సునీల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు. ఛైర్మన్ రేమాల వెంకట్రామిరెడ్డి పనితీరును ప్రశంసిస్తూ సొసైటీ అభివృద్ధిపై చర్చలు జరిపారు.

## శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న కమిషనర్



**నెల్లూరు,మే10,ప్రభాతవార్త** నెల్లూరు రూరల్ మండలం నరసింహకొండలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీ వేదగిరి లక్ష్మీనరిసింహాస్వామిని బుధవారం కమిషనర్ వికాస్ మరమ్మత్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ ధర్మకర్త మండలి సభ్యులు ఘనస్వాగతం పలికారు. అనంతరం విశేష పూజలు చేశారు.

# ముఖ్యమంత్రి పర్యటనకు అసౌకర్యాలు లేకుండా అన్ని ఏర్పాట్లు సిద్ధం



**కావలి, మే 10 ప్రభాతవార్త** రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పర్యటన సందర్భంగా కావలి పట్టణంలో ఈ నెల 12వ తేది బహిరంగ సభకు వస్తున్న లబ్ధిదారులకు, ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు లేకుండా అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామని నెల్లూరు జిల్లా కలెక్టర్ యం.హరినారాయణన్ తెలిపారు. బుధవారం సాయంత్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ పనులను, సెక్యూరిటీ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ హరినారాయణన్, జిల్లా ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ముఖ్యమంత్రి కార్యాలయం ఇంటలిజెన్స్ అధికారి గోపాలకృష్ణలు పరిశీలించారు. అనంతరం బహిరంగ సభ ప్రదేశాన్ని, పార్కింగ్ ప్రదేశాన్ని సందర్శించారు. సెక్యూరిటీ ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు తగు సూచనలతో ఆదేశాలు ఇచ్చారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడారు. వేలాది మంది ప్రజలు ముఖ్యమంత్రి సభకు విచ్చేస్తున్నారన్నారు. అందుకు గాను 40 గ్యాలరీలు ఏర్పాటు చేశామన్నారు. ఒక్కో గ్యాలరీకి ఒక మండల స్థాయి అధికారితో పాటు పది మంది సిబ్బందిని నియమించామన్నారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వచ్చిన వారందరికి తాగునీరు, స్నాక్స్ అందించి తదితర సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఈ గ్యాలరీలకు ఓవరాల్ ఇన్‌చార్జులుగా జిల్లా పరిషత్ సిఇవో చిరంజీవి, పిడి డిడబ్ల్యుయంఎ వెంకట్రావులను నియమించామన్నారు. జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్, అడిషినల్ ఎస్పీ హిమవతి, నుడా వైస్ ఛైర్మన్ పి.బాపిరెడ్డి, కావలి, ఆత్మకూరు ఆర్డీవోలు శీనానాయక్, కరుణకుమారి, ఆర్‌అండ్‌బి ఎస్ఇ గంగాధర్, డిపివో సుస్మిత, డిటిసి చందర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య, కావలి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, తహశీల్దార్ మాధవరెడ్డి, జెడ్పీ సిఇవో, పిడి డిడబ్ల్యుయంఎ తదితర అధికారులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి పర్యటనకు చురుకుగా పనులు చేస్తున్న అధికార యంత్రాంగం

**కావలి, మే 10 ప్రభాతవార్త** ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఈ నెల 12వ తేది కావలికి వస్తున్న సందర్భంగా అధికార యంత్రాంగం తలమునకలై మూడు రోజులుగా పనులను చేపట్టడంలో నిమగ్నమయ్యారు. కావలి జిల్లా పరిషత్ పాఠశాల క్రీడా మైదానంలో హెలిప్యాడ్ నిర్మాణ పనులు పూర్తి చేశారు. హెలికాప్టర్ ల్యాండ్ అవడానికి వీలుగా చుట్టుపక్కల భవనాలపై, స్తంభాలపై జెండాలు ఏర్పాటు చేశారు. పర్యావరణానికి, చల్లదనానికి నాటిన చెట్లను అధికారులు నరికి వేయించారు. మొక్కలు నాటి చెట్లుగా ఎదిగేలా కష్టపడిన వారు ఈ చర్యలకు లబోదిబోమన్నారు. హెలిప్యాడ్ నుండి ముఖ్యమంత్రి సభా వేదిక వరకు ఆర్‌అండ్‌బి అధికారులు ఇరువైపుల బారికేడ్లు ఏర్పాటు చేశారు. వందలాది మంది కార్మికులు గత మూడు రోజులుగా శ్రమిస్తూ గ్యాలరీని సిద్ధం చేశారు. వేదిక వద్ద అధికార యంత్రాంగం గ్యాలరీలో కుర్చీలు ఏర్పాటు చేశారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని తాగునీటి ఏర్పాట్లు కల్పించారు. వాహనాల పార్కింగ్ కోసం గ్రౌండ్‌ను చదును చేశారు. మున్సిపల్ అధికారులు, పారిశుధ్య కార్మికులతో పట్టణమంతా పరిశుభ్రం చేయడంలో నిమగ్నమయ్యారు. అన్ని శాఖల అధికార యంత్రాంగాలు సియం పర్యటన మీదే మనసు పెట్టారు. దీంతో కార్యాలయాలలో అధికారులు కానరాకపోవడంతో పనులు స్తంభించిపోయాయి.



## కృష్ణపట్నం సైట్‌లో వ్యవసాయ అధారిత జీవనోపాధికి కృషి విజ్ఞాన కేంద్రం



**ముత్తుకూరు,మే10,ప్రభాతవార్త** రైతులు, మహిళలు వారి జీవనోపాధిపై ఆధారపడి వ్యవసాయాన్ని మెరుగుపరచడానికి కృష్ణపట్నం సైట్‌లోని ఆదానీ ఫౌండేషన్ కృషి విజ్ఞాన కేంద్రం నెల్లూరు జిల్లాతో చేతులు కలిపింది. రాజేష్ రంజన్, సిఎస్‌ఆర్ హెడ్, ఆదానీ ఫౌండేషన్, సిహెచ్ నెల్లూరులోని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ లోకేష్‌బాబుతోఆదానీ ఫౌండేషన్ సీనియర్ పీఓ రమేష్‌బాబు సమావేశమై ప్రభుత్వాన్ని గుర్తించారు. గుర్తింపబడిన ప్రభుత్వం అమలు కోసం ఆదానీ ఫౌండేషన్ ద్వారా కన్వర్జెన్స్ కోసం పథకాలు, కృష్ణపట్నం, చలివేంద్రం, నారికేళ్లపల్లి, ఈపూరు వెంకన్నపాలెం, ముత్తుకూరు గ్రామాల్లో రైతులకు, మహిళలకు మేలు జరిగేలా వ్యవసాయ అభివృద్ధి కార్యక్రమాలు. ప్రభుత్వం కింద గుర్తింపబడిన వ్యవసాయ అధారిత కార్యకలాపాలు, కృషి వికాస్ కేంద్రం ద్వారా పథకాలు అమలు కోసం ఆశించిన మొత్తంలో ఈ విధంగా ఉన్నాయి. రైతులకు వినూత్న వ్యవసాయశిక్షణ, ఆధారిత జీవనోపాధి అవకాశాలు కోసం రూతులతో బృంద చర్యలు, వ్యవసాయ పద్ధతులపై ప్రదర్శన, వేరుశనగ విత్తనాల అంకురోత్పత్తి క్షేత్ర పరీక్షలు, రైతు ఉత్పత్తిదారుల పెంపకం, సాగు, ఎస్సీ సబ్‌ప్లాన్ కార్యకాలాపాల అమలు, మినుములు ఆహార తయారీలో మహిళలకు శిక్షణ, కిచెన్ గార్డెన్ అభివృద్ధి, ఊరగాయల తయారీ శిక్షణ, మత్స్య అభివృద్ధి కార్యకాలాపాలు, సన్నకారు రైతులకు విలువజోడించిన కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు.

## బ్రిటీష్ కాలంనాటిది చుక్కల భూముల సమస్య



**కావలి, మే 10 ప్రభాతవార్త** చుక్కల భూముల సమస్య బ్రిటీష్ కాలంనాటిదని, కృష్ణపట్నం పోర్టు భూసేకరణ విషయంలో 2006లో చుక్కల భూముల్ని బ్లాక్‌లో పెట్టిన ఘనత ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డిదేనని, తెలియకుండా కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అవాకులు చెవాకులు పేలడం మంచిపద్దతి కాదని టిడిపి కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు హెచ్చరికలు చేశారు. కావలి టిడిపి కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాలేపాటి పాల్గొని మాట్లాడారు. టిడిపి జాతీయ అధ్యక్షులు, అభివృద్ధి ప్రధాత నారా చంద్రబాబునాయుడు, మాజీ మంత్రి నారా లోకేష్‌ల పట్ల కావలి ఎమ్మెల్యే నోరుపారేసుకోవడం తగదన్నారు. కావలి పట్టణంలో, నియోజకవర్గంలో అభివృద్ధి చేయడం చేతగాక, ధనదాహమే ధ్యేయంగా పెట్టుకొని సిగ్గులేకుండా ఎమ్మెల్యే మాట్లాడటం మంచి పద్ధతి కాదన్నారు. తుమ్మలపెంట రోడ్డు, దగదర్తి రోడ్డు నిర్మాణాల కాంట్రాక్టర్ల వద్ద అధిక కమిషన్లు ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి అడగడంతో కాంట్రాక్టర్లు వెళ్లిపోయారన్నారు. పనులు ఆగిపోయాయన్నారు. తెలుగుదేశం పాలనలోనే అభివృద్ధి జరిగిందన్నారు. వైసిపి పాలనలో దోపిడీ, అవినీతి, అరాచకాలు, ప్రశ్నిస్తే కేసులు తప్ప ఒరిగిందేమి లేదన్నారు. కావలి ప్రాంతంలో గోచిపాతల తేజపై వైసిపి నేతలు చేసిన దాడులు, దుగ్గిరాల కరుణాకర్ ఆత్మహత్య, పైడి హర్ష ఆత్మహత్నాయత్నం పాపాలన్ని ఈ ఎమ్మెల్యేవేనన్నారు. పైడి హర్ష కుటుంబం ఛిద్రంకావడానికి కారణం కావలి ఎమ్మెల్యేనన్నారు. మాలేపాటి కుటుంబం అంటే ఏమిటో తెలుసుకోమని సవాల్ విసిరారు. డబ్బుందన్న పొగరుతో రానున్న ఎన్నికలలో ఓటుకు పది వేలు ఇస్తానన్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి డబ్బు అహంకారంతో నోరు పారేసుకుంటున్నాడన్నారు. నోరు జాగ్రత్తగా పెట్టుకొని రానున్న ఎన్నికలలో నువ్వా,నేనో తేల్చుకుందాం రా అంటూ సవాల్ విసిరారు. ఈ ఎమ్మెల్యే అక్రమాలు, దందాలు కావలి ప్రజలకు తెలుసునన్నారు. కావలి ప్రజల తీర్పుకు రానున్న ఎన్నికలే అద్దంపడతాయన్నారు. ఈ సమావేశంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మన్నవ రవిచంద్ర, పట్టణ ప్రధాన కార్యదర్శి జ్యోతిబాబురావు, టిడిపి నేతలు కుందుర్తి కిరణ్, ఆత్మకూరి నాగరాజు, అన్నపూర్ణ శ్రీను, బొట్లగుంట శ్రీహరినాయుడు, తదితరులు మాట్లాడారు. కావలి ఎమ్మెల్యే రెండు వేల కోట్ల రూపాయలు అవినీతిగా సంపాదించాడన్నారు. పార్టీలు మారిన వడ్లమూడి వెంకటేశ్వర్లు నోరు జాగ్రత్తగా పెట్టుకోకపోతే తగిన బుద్ధిచెబుతామని హెచ్చరికలు చేశారు. మాలేపాటి కుటుంబాన్ని విమర్శించే స్థాయి వైసిపి నేతలకు లేదని హెచ్చరికలు చేశారు.

## కారు-బైకు ఢీ ఒకరికి గాయాలు

**సంగం మే 10 ప్రభాతవార్త** సంగం మండలం గాందీజనసంఘం గ్రామం వద్ద కారు మోటార్‌బైకు ఢీకున్న సంఘటనలో ఒకరికి గాయాలు అయ్యాయి. ఈ సంఘటనలో దువ్వూరుకి చెందిన బాషా అనే వ్యక్తి తీవ్రగాయాలు అయ్యాయి. ఆత్మకూరు వైపు వెళుతున్న కారు దువ్వూరు వైపు బైకు వస్తున్న బాషాను ఢీకొనగా అతనికి తీవ్రగాయాలు అయ్యాయి. వెంటనే ఆయనను 108 వాహనంలో వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అంగన్‌వాడీ వేతనాలు పెంచాలి




**బుచ్చి మే 10ప్రబాతవార్త** చాలీచాలని జీతాలతో నాని ఇబ్బందులు పడుతున్న అంగన్‌వాడీల వేతనాలు పెంచాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరామమ్మ డిమాండ్ చేశారు. బుధవారం దామరమడుగు, పల్లిపాలెం,లో జరుగుతున్న అంగన్‌వాడీ ఆయాల రాజకీయ శిక్షణా తరగతులు కార్యక్రమంలో పాల్గోన్న సందర్బంగా ఆమె మాట్లాడుతు మార్చినెలలో వేతనాలు పెంపు కోసం జరిగిన ఆందోళన సందర్బంగా అసెంబ్లీలో మంత్రియూనియన్‌తో చర్చించి తెలంగాణ రాష్ట్రం కన్నా ఎక్కువ జీతాలను ఇస్తామని హామి ఇచ్చారు. ఈ హామిని మంత్రి ఇంతవరకు నెరవేర్చలేదని అన్నారు. ప్రభుత్వం స్పందించి తెలంగాణా రాష్ట్రం కన్నా ఎక్కువ వేతనాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఐసిడిఎస్ ప్రాజక్టు ఎత్తివేసేందుకు కుట్ర పన్నుతుందని అంగన్‌వాడీలందరు సంఘటితంగా దీనిని ఎదుర్కోని ప్రాజక్టును కాపాడుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా కార్యదర్శలు రెహనాబేగం, సుజాత హెల్పర్స్ జిల్లా నాయకులు కామాక్షమ్మ, సంపూర్ణమ్మ, సిఐటియు మండల కార్యదర్శి చల్లకొలుసు మల్లికార్జున, ఎల్.వి .శేషమ్మ, తదితరులు పాల్గోన్నారు.

# మానవతా దృక్పథంతో సమస్యలకు పరిష్కారం



**నెల్లూరు అర్బన్,మే10,ప్రభాతవార్త** కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో బుధవారం ఏర్పాటు చేసిన ప్రాతికేయుల సమావేశంలో జిల్లా కలెక్టర్ హరినారాయణన్ మాట్లాడుతూ ప్రభుత్వ ం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, సేవలకు సంబంధించిన వ్యక్తి గత స్థాయిలో ప్రజలకు ఎదురైయ్యే సమస్యలకు మరింతగా మెరుగైన పరిష్కారమార్గం చూపాలన్న లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఈనెల 9న జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని, ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు గురించి ప్రజలు తెలుసుకునేందుకు వారి నుండి ఫిర్యాదులు స్వీకరించి సత్వరం పరిష్కరించడమే ఈ కార్యక్రమ ముఖ్యఉద్దేశమని కలెక్టర్ తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై ఫిర్యాదు చేయడానికి 1902 టోల్‌ఫ్రీ నెంబర్ కి ఫోన్ చేయడంగానీ, సమీపంలోని సచివాలయంలోగాని లేదా ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్లో నిర్వహించు జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ధరఖాస్తు చేసుకోవచ్చునని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజల నుండి అందిన అర్జీలను పరిష్కరించేందుకు మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక ప్రాజెక్టు మోనిటరింగ్ యూనిట్ విధానాన్ని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా అర్హత ఉండి సంక్షేమ పథకాలు లబ్ధిపొందిన వారు మరియు ప్రభుత్వ సేవల సమస్యలకు సంబంధించిన అంశాలపై ఫిర్యాదు చేయవచ్చని ఫిర్యాదు చేసిన వాటికి వైసీపీ యూనిట్ ఐడీని కేటాయించడంతో పాటు సదరు సమస్యను ఏదశలో ఉందని ఫిర్యాదారునికి ఐవి ఆర్ఎస్ ద్వారా తెలుపుతూ సమస్య పరిష్కారం కోసం కృషి చేయడం జరుగుతుందన్నారు. ఫిర్యాదుల పరిష్కారం విధానంపై మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో ప్రత్యే మానిటరింగ్ కమిటీలు పనిచేయడంతో పాటు పరిష్కరించబడిన ఫిర్యాదు సంతృప్తికరంగా పరిష్కరించబడిందా లేదా అనే ఫీడ్‌బ్యాక్ విధానంలో తెలుసుకోవడం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. గ్రామస్థాయి కమ్యూనిటీ సంబంధ సమస్యల పరిష్కారానికి గడపగడపకు మన ప్రభుత్వం వంటి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో సంక్షేమ పథకాలు అమలు, ప్రత్యేక సేవల సమస్యలకు సంబంధించిన అంశాలపై ప్రజలు ఫిర్యాదు చేయవచ్చునని, ప్రజల సమస్యలను మానవత్వ దృష్టిలో పరిష్కారం చూపాలన్నదే ఈ కార్యక్రమం ప్రధానలక్ష్యమని, ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగాకలెక్టర్ హరినారాయణన్, ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## కామాక్షితాయి సేవలో నెల్లూరు కమీషనర్ వికాస్‌మర్మత్



**బుచ్చి మే 10 ప్రభాతవార్త** పవిత్రపుణ్యక్షేత్రమైన జొన్నవాడలోని శ్రీమల్లికార్జుస్వామి కామాక్షితాయి సన్నిధిలో శ్రీమల్లికార్జునస్వామి, కామాక్షితాయిని నెల్లూరు మున్సిఫల్ కమీషనర్ వికాస్ మర్మత్ కుటుంబసభ్యులతో కలిసి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్బంగా ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రమణ్యంనాయుడు, ఆలయ ఇఒ డబ్బుగుంట వెంకటేశ్వర్లు కమీషనర్‌కి ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ అర్చకులు దాతలు ఆశీర్వచనం అందించారు. అనంతరం అతిధులను శ్రీవార్ల శేష వస్త్రంతో సన్మానించారు. ప్రసాదాలు అందజేశారు.

## సిఎం జగనన్న పాలనలో ఉపాధికి పెద్దపీట



-ఎమ్మెల్యే వెంకటేగౌడ.

వి.కోట మే 10 ప్రభాతవార్త : రాష్ట్రంలో సిఎం జగనన్న పాలనలో ఉపాధికి పెద్దపీట వేస్తున్నారని పలమనేరు ఎమ్మెల్యే డా॥ఎన్. వెంకటేగౌడ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని బైరుపల్లి సచివాలయ పరిధిలోని మాదకుప్పం, గోవిందపురం,యాదకుంట,తుపాకి చిన్నేపల్లి గ్రామాల్లో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులుతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా 363 గృహాలను వారు నేరుగా సందర్శించి లబ్ధిదారులకు సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందజేసారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర విభజన తరువాత రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులు 4లక్షల మంది ఉండేవారని వైకాపా ప్రభుత్వం అధికారంలో వచ్చిన తరువాత ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్య ఆరు లక్షలకు పైగా చేరిందన్నారు.ముఖ్యంగా మూడు లక్షలకు పైగా కాంట్రాక్టు,ఔట్ సోర్సింగ్ ఉద్యోగ అవకాశాలు కల్పించారని సచివాలయం వ్యవస్థద్వార 1.30లక్షల మందికి శాస్వత ఉద్యోలు కల్పించిన ఘనత వైఎస్ జగనన్నకే దక్కుతుందన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపిపి యుతరాజ్,వైస్ ఎంపిపిలు లక్ష్మణ్ రెడ్డి,తమీంఖాన్,పిఏసిఎస్ ఛైర్మన్ గోపిరెడ్డి,సర్పంచ్ నీలమ్మ,ఎంపిటిసి మురుగేష్,స్థానిక నేతలు ఇంద్రేష్,శంకర్ రెడ్డి,సభాష్,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు ఆరోగ్యశ్రీ సేవలు అందడం లేదు

గాలి భానుప్రకాశ్



పుత్తూరు, మే 10 ప్రభాతవార్త : వైసిపి ప్రభుత్వ పాలనలో ప్రచార ఆర్బాటం తప్ప పేదలకు ఆరోగ్య శ్రీ సేవలు అందడం లేదని తెలుగుదేశం పార్టీ నగరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ గాలి భానుప్రకాశ్ ఆరోపించారు. రూ. 1000 దాటితే ఉచిత వైద్యమని ప్రగల్బాలు పలికారని, చాలా మందికి ఆరోగ్యశ్రీ కార్డులే అందని నేపథ్యంలో ఇక ఆరోగ్యశ్రీ సేవలు ఎలా అందుతాయని ప్రశ్నించారు. బుధవారం మునిసిపాలిటీ పరిధిలోని చెర్లోపల్లిలో ఆయన పర్యటించి అనారోగ్యంతో బాధపడుతున్న దుర్గయ్యను పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తనకు ఇప్పటి వరకూ ఆరోగ్యశ్రీ కార్డు ఇవ్వలేదని దీంతో ప్రైవేటు ఆస్పత్రుల్లో తాను ఉచితంగా వైద్యం చేయించుకోలేకపోతున్నానని బాధితుడు ఆవేదన వ్యక్తం చేసినట్టు తెలిపారు. గత ప్రభుత్వంలోఎన్టీఆర్ఆరోగ్యశ్రీద్వారాపేదలకుమెరుగైన వైద్యం అందిందని తెలిపారు. ప్రైవేటు ఆస్పత్రులకు సకాలంలో బకాయిలు చెల్లించడం వల్ల పేదలకు ఇబ్బంది లేకుండా వైద్య చికిత్సలు జరిగేవన్నారు. వైసిపి ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లవుతున్నా ఇప్పటికీ ఆరోగ్యశ్రీ కార్డులు అందని పేదలు వున్నారంటే ప్రభుత్వ పనితీరు ఎలా వుందో అర్థమవుతోందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడుగాలిజీవరత్నంనాయుడు, చిత్తూరు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు గంజి మాధవయ్య, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆనంగి ఆనంద్, 21వ వార్డు అధ్యక్షుడు ఆనంగి రమేష్, పట్టణ అధికార ప్రతినిధి జి.బాబు, ఇంకా నాయకులు చిన్నాయులు, బాబు, అంజి, వసంతమ్మ, రమ తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్‌నగర్ అక్రమ అమ్మకాల్లోఅక్రమార్కుల భరతం పడుతాం

-సిఐ మల్లిఖార్జున

శ్రీకాళహస్తి, మే 10 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి రాజీవ్‌నగర్‌లో అక్రమార్కుల భరతం పడుతామని టుటౌన్ సిఐ టి.మల్లికార్జున తెలిపారు. బుధవారం రాజీవ్‌నగర్ అక్రమ పట్టాల కేసులో కీలకంగా మారిన అల్లూరయ్యను అరెస్టుచేసినట్లు తెలిపారు. ఈకేసులో అల్లూరయ్యతో పాటు పట్టణానికి చెందిన మరో పది, పదిహేను మంది కీలకసూత్రదారులు ఉన్నట్లు గుర్తించామని సిఐ వివరించారు. ఈకేసుకు సంబందించి లోతుగా విచారణ జరగాల్సి ఉందని సిఐ అభిప్రాయపడ్డారు. పట్టాల జారీసమయం నుంచే అక్రమాలు జరిగాయని తమ ప్రాథమిక విచారణలో వెల్లడైందన్నారు. ఈభాగోతంలో పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు ఉన్నట్లు సిఐ వివరించారు. పట్టాల జారీ సమయంలో కొందరు ప్రజాప్రతినిధులు బినామీపేర్లతో పట్టాలు తీసుకోవడం జరిగిందని తెలిసిందన్నారు. పట్టాలు తీసుకున్న వారు కూడా తక్కువ ధరకు అమ్ముకున్నట్లు ఈవిధాన నిబంధనలకు వ్యతిరేఖమైనా అమలు జరిగిందని వివరించారు. రాజీవ్‌నగర్‌లో బయటి ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారి పేర్లతో పట్టాలు తీసుకున్నారని వారి పర్యవేక్షణ లేకపోవడంతో కొంతమంది అక్రమార్కులు ఇక్కడ పాగా వేసి వ్యాపారం సాగించినట్లు తమ ప్రాథమిక విచారణలో తెలిసిందన్నారు. అయితే ఈ అంశాలన్నింటిపై లోతుగా విచారణ చేపడుతున్నట్లు సిఐ తెలిపారు. గతంలో జరిపిన విచారణల ఆధారంగా కొంతమంది లబ్ధిదారులకు అవకాశం కల్పించినట్లు తెలిసిందన్నారు. అంతేకాక నిరుపేదలకోసం సేకరించిన స్థలంలో టిడ్కో ఇండ్లు కూడా నిర్మించినట్లు సమాచారం. అయితే ఈ అంశాలన్నీ సమగ్ర విచారణలో తేలాల్సి ఉందన్నారు. నేటికీ కొందరి చేతిలో పట్టాలు ఉండగా ఆస్థలంలో మరొకరు ఇండ్లు నిర్మించుకుని ఉన్నారని ఈసున్నితమైన అంశాలను పరిగణలోకి తీసుకుని అన్నిశాఖల సమన్వయంతో విచారణ జరిపేందుకు ఉన్నతాధికారులను కోరనున్నట్లు సిఐ మల్లికార్జున తెలిపారు. అల్లూరయ్యను అరెస్టు చేశామని కస్టడీలోకి తీసుకుని విచారణ జరుపుతామని ఓ ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. సమావేశంలో ఎస్ఐ మహేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## కోడి పందెం స్థావరంపై దాడి

- నలుగురు అరెస్టు



వెదురుకుప్పం, మే 10 ప్రభాతవార్త : కోడి పందెం స్థావరం పై దాడి చేసి నలుగురు అరెస్టు చేసిన్నట్లు ఎస్ఐ లోకేష్ తెలిపారు. ఆయన కథనం మేరకు మండలంలోని పచ్చికాపల్లం పంచాయితీ పరిధిలోని ఎర్రగుంట సమీపంలో కోడి పందెలు జరుగుతున్నట్టు వచ్చిన సమాచారం ప్రకారం తన సిబ్బందితో దాడి చేయగా కోడి పందెలు జరుగుతున్న ప్రాంతంలో నలుగురు వ్యక్తులను పట్టుకుని అరెస్టు చేసిన్నట్లు చెప్పారు. అలాగే పందెలు జరుగుతున్న స్థావరం వద్ద 12 ద్విచక్ర వాహనాలు, రెండు వేల రూపాయాలు నగదు, 1.5 లక్షల విలువ చేస్తే కోడి పందెలకు ఉపమోగించే కోడిపుంజులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఘటన పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## శ్రీలక్ష్మీ మహాయజ్ఞం గోడపత్రిక ఆవిష్కరణ



కాణిపాకం, మే 10 ప్రభాతవార్త: విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో ఈనెల 12 నుండి 17 వరకు మూడు రోజుల పాటు రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో జరుగనున్న అష్టోత్తర శత కుండాత్మక చండీ, రుద్ర రాజశ్యామల , సుదర్శన సహిత శ్రీలక్ష్మీ మహా యజ్ఞం కార్యక్రమంకు సంభందించి గోడపత్రిక, కరపత్రాలను బుధవారం స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్.బాబు చేతుల మీదుగా ఆవిష్కరించారు. రాష్ట్ర దేవాదాయశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రం సుభిక్షంగా వుండాలని, ప్రజలందరూ శాంతి, సుఖ సంతోషాలతో వుండాలని కోరుతూ ఈనెల 12 నుండి 17 వరకు ఏడు రోజుల పాటు ఈయజ్ఞంను నిర్వహిస్తున్న విషయం విధితమే. ఈమేరకు ఈయజ్ఞంకు సంభందించి కాణిపాకం దేవస్థానం ముద్రించిన కరపత్రాలను, గోడపత్రికలను ఎమ్మెల్యే బాబు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈయజ్ఞంలో భక్తులు పెత్తఎత్తున పాల్గొనాలని కోరారు. ఈకార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ ఎ.వెంకటేశు, దేవాదాయశాఖ విశ్రాంత అదనపు కమీషనర్ జి.కేశవులు, ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, స్థానిక సర్పంచ్ కెఎస్.శాంతిసాగర్ రెడ్డి, సూపరెండెంట్‌లు కోదండపాణి, శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## వెంకటరమణ మృతికి విజయ్‌భాస్కర్ రెడ్డి సంతాపం

పెద్దపంజాణి మే 10 ప్రభాతవార్త :



పెద్దపంజాణి మండలం శివాడి గ్రామానికి చెందిన వైకాపా సీనియర్ నాయకులు కె.వెంకటరమణ మృతికి వైకాపా రాష్ట్రకార్యదర్శి,మాజీ ఎంపిపి రెడ్డివారి విజయ్‌భాస్కర్ రెడ్డి సంతాపం తెలిపారు. గ్రామంలో వైకాపా సీనియర్ నాయకులైన కె.వెంకటరమణ ఆకస్మికంగా మృతి చెందారు.ఈ విషయం తెలుసుకున్న రెడ్డివారి విజయ్ భాస్కర్ రెడ్డి బుధవారం వారి నివాసం చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు ధనంజయ రెడ్డి,రవిచంద్రారెడ్డి,చామనేరు వైస్ సర్పంచ్ ఎం.ఎస్.రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అవ్వేక్ చారిటి సంస్థచే విద్యార్థులకు బహుమతులు ప్రధానం

పెద్దపంజాణి మే 10 ప్రభాతవార్త :



మండలంలోని రాజుపల్లి అవ్వేక్ చారిటీ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు బహుమతులు అందించారు .రాజుపల్లి ఎస్.పి.ఎం చర్చిలో మూడు రోజులపాటు వేసవి శిక్షణా శిబిరాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా పిల్లలకు వివిద రకాల ఆటలపోటీలు, కథలు పోటీలు నిర్వహించి విజేతలుగా నిలిచిన పిల్లలకు బహుమతులు అందజేసారు.విద్యార్థులు విద్యతో పాటు వివిధ రంగాలపై ఆసక్తి చూపాలని వైకాపా జిల్లా కార్యదర్శి ఎ.తమ్మిరెడ్డి సూచిం చారు.ఫాస్టర్ నరేష్ శ్యాంవేల్ ,డా॥సునీల్(మదనపల్లి),మురళి,రాజేందర్ తదితరలు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ఏపార్టీకయినా...ఏరాష్ట్రంలో అయినా జగన్ పథకాలే మార్గదర్శకం



-మంత్రి పెద్దిరెడ్డి

పుంగనూరు,మే10 ప్రభాతవార్త

దేశంలో ఎన్నికల హవా మొదలు కావడంతో ఇపుడు తమ మానిఫెస్టోల రచనలకు దేశంలోని పలు రాష్ట్రాలలో పలు పార్టీలు వైకాపా మానిఫె స్టోను కాపీ కొడుతున్నాయని,సంక్షేమపథకాలకే ఆద్యరచన చేసిన ఉత్తమపరిపాలకుడుగా సిఎం జగన్మోహన్‌రెడ్డి మార్గదర్శకంగా నిలుస్తున్నారని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. బుధ వారం ఆయన పుంగనూరు పట్టణంలో మున్సిపల్ ఛైర్మన్ అలీంబాషా అధ్వర్యంలో జరిగిన సచివాల యాల కన్వీనర్లు,గృహసారధులు,ప్రజాప్రతినిధులనుద్దేశంచి ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ ఇపుడు ఎన్నికల సమయంలో బిజెపి సైతం వైకాపా పథకాలను తమ మానిఫెస్టోలో అనుసరించడం గమనార్హమన్నారు. ప్రజలకు ఉపయోగపడే ఏపథకమనా తొలుత ఆంధ్రప్రదేశ్ నుంచే ప్రారంభం అవుతుం దన్న విషయాన్ని ప్రపంచం గుర్తించిందన్నారు. సచివాలయాల ఏర్పాటు,వాలంటీర్ల వ్యవస్థ,ఆర్‌బికేల సేవలు,గృహసారధుల సారథ్యం వంటివిషయాలు ప్రజాపరిపాలనా వ్యవస్థలో అద్భుతాలు సృష్టించి,పాలనా వ్యవస్థను పారదర్శకం చేయడం వల్ల సమాజసమతౌల్యత సాధించబడిందన్నారు. ఎంపి ఎన్.రెడ్డెప్ప జడ్పీఛైర్మన్ శ్రీనివాసులు,ఏపి జానపదకళల అకాడమీ ఛైర్మన్ కొండవీటి,పిఎంకే ఉడా ఛైర్మన్ వెంకటరెడ్డియాదవ్,నియోజకవర్గ పరిశీలకుడు జింకాచలపతి,వైకాపా రాష్ట్ర కార్యదర్శులు పెద్దిరెడ్డి,బైరెడ్డిపల్లి కృష్ణమూర్తి,రెడ్డెప్ప,సచివాలయాల కన్వీనర్ వరదారెడ్డి,ఏఎంసి ఛైర్మన్ అమరనాథరెడ్డి, ఆర్టీసి మజ్దూర్‌యూనియన్ ఛైర్మన్ జయరామిరెడ్డి,పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎస్సీవర్గీకరణ ముమ్మాటికీ దారుణ కుట్ర

-రాష్ట్ర మాలమహానాడు కార్యదర్శి ఆశోక్

పుంగనూరు, మే 10 ప్రభాతవార్త :

కులాల పేరుతో దళితులను వర్గీకరించేందుకు ప్రభుత్వాలు దారుణ కుట్రలకు పాల్పడ్డాయని, ఆకుట్రలను ఛేధించిన దళతవీరుడు పివిరావు అని రాష్ట్ర మాలమహానాడు ప్రధాన కార్యదర్శి ఎన్ఆర్ అశోక్ అన్నారు. బుధవారం పుంగనూరులో జరిగిన పివిరావు జయంతి వేడుకలలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ దళితులను వర్గీకరించి,విభేదాలు సృష్టించేందుకు ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా దివంగత పివిరావు సూచించిన మార్గంలో పోరాటాలు నిర్వహిస్తామన్నారు.కారంచేడు,చుండూరు ఘటనలతో పాలకులు తమకు రోజులు దగ్గరపడ్డాయని భావించి వర్గీకరణకు మార్గం ఏర్పాటుచేసుకున్నాయన్నారు. అయితే,ఆగస్టు 11,1997 తొలిస్వతంత్ర్యపోరాడం ప్రారంభించడం చారిత్రాత్మకమన్నారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## బాలిక అదృశ్యం : కేసునమోదు

పుంగనూరు,మే10 ప్రభాతవార్త

పట్టణంలోని నానాసాహెబ్‌పేటకు చెందిన పదిహేడేళ్ళ మైనర్‌బాలిక మంగళవారం నుంచి కనుపించడం లేదని బాలిక తండ్రి ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ మోహన్‌కుమార్ తెలిపారు. ఎన్టీఆర్ కాలనీకు చెందిన రమేష్‌కుమార్తె ఆచూకి తెలిసిన వారు పుంగనూరు పోలీస్‌స్టేషన్‌లో తెలియచేయాలని కోరారు.

## తప్పిన పెనుప్రమాదం



పాలసముద్రం, మే 10 ప్రభాతవార్త: మండలంలోని బలిజకండ్రిగ-చిత్తూరు రహదారిలో బుధవారం ప్రయాణీకులకు పెనుప్రమాదం తప్పింది. వెంగళరాజుకుప్పం సమీపంలో ఓ ప్రైవేటు బస్సు పెళ్ళి బృందంతో బలిజకండ్రిగ నుండి చిత్తూరు గంగాసాగరంకు బయలుదేరింది. ఈ క్రమంలో బస్సు డ్రైవర్ బస్సును వేగంగా నడుపడంతో అదుపు తప్పి ఒక టేకు చెట్టుకు బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎవరికి పెద్దగా గాయాలు లేకపోయినప్పటికీ బస్సు ముందర భాగం దెబ్బతింది. ప్రమాదం జరిగిన సంఘటనా స్థలంకు ఎఎస్ఐ మురుగేష్ తన బృందంతో చేరుకొని బస్సును స్టేషన్ వద్దకు తీసుకెళ్ళారు. ఎస్ఐ షెక్షావలీ డ్రైవర్‌ను హెచ్చరించి నోటీసులు జారీ చేశారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## సిపిఎస్‌ను రద్దు చేయకపోతే ప్రాణ త్యాగాలకైన సిద్ధం

-ఎపిసిపిఎస్ ఉద్యాగుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు దేవానందం



వెంకటగిరి, మే 10 ప్రభాతవార్త

సిపిఎస్‌ను రద్దు చేయక పోతే ప్రాణత్యాగాలకైన సిద పడుతామని ఎపిసిపిఎస్ ఉద్యాగుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఆర్ దేవానందం తెలిపారు. సిపిఎస్ రద్దు,పాతపెన్షన్ విదానాన్ని కొనసాగించాలని ఉద్యాగుల సంఘంవారు వెంకటగిరి తాసిల్దార్ కార్యలయం కూడలి వద్ద బుదవారం శాంతియుత రిలేనిరాహార దీక్షలను చేశారు. ఆయన మాట్లా డుతూ ఎన్నికల ముందు సిపిఎస్‌ను రద్దుచేస్తానని సిఎం జగన్‌మోహన్ రెడ్డి హామి ఇచ్చారని అయితే ఇంతవరకు రద్దు చేయలేదన్నారు. ఈ దీక్షలలో నాయకులు పివి సుబ్బారెడ్డి,శ్రీనాద్,షమీర్ తదితరులు పాల్గొన్నారు.

## 24న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

బాలాయపల్లి మే 10 ప్రభాతవార్త

ఈ నెల 24న స్త్రీశక్తి భవనంలో ఎంపిపి భాస్కరరెడ్డి అద్యక్షతన మ ండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతందని ఎంపిడిఒ స్వరూపరాణి తెలిపారు. తాగునీటి సమస్య, గృహనిర్మాణ పనులు తదితర అంశాలపై సమావేశంలో చర్చిస్తారని తెలిపారు. గౌరవ సభ్యులు సమావేశంకు హాజరు కావాలని కోరారు.

## సంక్షేమంతో సమాజంలో పేదరిక నిర్మూలన



- ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

సూళ్లూరుపేట, మే 10 ప్రభాతవార్త

రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి సమాజంలో పేద రిక నిర్మూలనకు కృషి చేస్తోందని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. బుధవారం మండల పరిధిలోని పిండిపాలెం గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్న జగన్‌మోహన్‌రెడ్డి ప్రస్తుతం జగనన్నకు చెబుదాం అనే కార్యక్రమాన్ని రూపొందించి ప్రజల వద్దకు పాలన తీసుకురావాలని కృషి చేస్తున్నారని చెప్పారు. సమస్యలను జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో తెలిపితే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తారని ఆయన చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు ప్రయత్నం చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్యే సంజీవయ్యకు వైసీపీ నేతలు ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి, వేల్లూరు సుకుమార్, సుధీర్, సుధీర్‌కుమార్, వైసీపీ నేతలు పాల్గొన్నారు.

## రవీంద్రభారతిలో టెన్ విద్యార్థులకు అభినందన



సూళ్లూరుపేట, మే 10 ప్రభాతవార్త

సూళ్లూరుపేటలోని శ్రీరవీంద్రభారతి హైస్కూల్‌లో 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థినులకు బుధవారం ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 591 మార్కు లు సాధించిన డి.ఝాన్సీలక్ష్మీశ్రీని సన్మానించారు. అలాగే హైస్కూలులో 33 మంది విద్యార్థులు మంచి మార్కులను సాధించి ఉత్తీర్ణతలో వందశాతం సాధించారని ఇన్‌ఛార్జి పి.ఉమ తెలిపారు.

## మోటార్ల దొంగను కఠినంగా శిక్షించాలి



- బాధిత రైతుల డిమాండ్

కోట, మే 10 ప్రభాతవార్త

పంట పొలాల్లోని రైతుల మోటార్లు, సోలార్ పంపుసెట్లు అపహరించే ముఠా వెనుక పెద్ద రాకెట్ నడుస్తోందని, అందుకు దొంగలను కఠినంగా శిక్షించాలని బాధిత రైతులు డిమాండ్ చేశారు. బుధవారం కోట పోలీసుస్టేషన్ ప్రాంగణంలో రైతులు విలేఖరులతో మాట్లాడారు. చిల్లకూరు మండలం అన్నంబాక, పార్లపల్లి తదితర గ్రామాల్లోని పంట పొలాల్లో ఉన్న అనేక మోటార్లు చోరీకి గురైనట్లు తెలిపారు. మోటార్లు దొంగలించిన వ్యక్తిని రైతులు వెంబడించి గుర్తించి కోట పోలీసులకు అప్పగించారని తెలిపారు. పోలీసులు సమగ్ర విచారణ జరిపించి

## సహకార సంఘాల ద్వారా రైతులకు విరివిగా రుణాలు

- ఎన్‌డిసిసిబి డైరెక్టర్ నరమాల వెంకటరమణయ్య

కోట, మే 10 ప్రభాతవార్త



సహకార సంఘాల ద్వారా రైతులకు విరివిగా రుణాలు ఇచ్చి ఆదుకుంటున్నామని ఎన్‌డిసిసిబి డైరెక్టర్ నరమాల వెంక టరమణయ్య చెప్పారు. బుధవారం కోట మండలం ఊను గుంటపాలెంలోని పిఎసిఎస్ కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్స వానికి ఆయన విచ్చేశారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో స్ట్రాంగ్ రూమ్, కమ్యూనిటీ హాల్‌ను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నాబార్డు ద్వారా సహకార సంఘం సభ్యులకు, రైతులకు రుణాలు ఇచ్చి ఆదుకుంటున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు సంక్షేమానికి అనేక పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. సచివాలయాల్లో ఆర్‌బికె కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల ముంగిటకు సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. రైతు రాజ్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రగతిపథంలో ముందుకు పోతోందన్నారు. అనంతరం సిఇఒ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ రైతుల భాగస్వామ్యంతో ఈ సహకార సంఘం జిల్లాలోనే ఆదర్శవంతంగా పనిచేస్తూ ముందుకు పోతున్నామని తెలిపారు. రైతులు, దాతల సహకారంతో ఇక్కడ స్ట్రాంగ్ రూమ్‌ను, అదనపు భవనాన్ని నిర్మించుకున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే తమ సంఘం జిల్లాలోనే ఆదర్శవంతమైన సంఘంగా నిలిచిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్‌డిసిసిబి జనరల్ మేనేజర్ శ్రీనివాసులు, డిప్యూటి జనరల్ మేనేజర్ వై.దయాకర్‌రెడ్డి, కోట కోఆపరేటివ్ బ్యాంకు మేనేజర్ సాయిరామ్, సొసైటీ అధ్యక్షులు హనుమంతరెడ్డి, కొత్తపాలెం సొసైటీ అధ్యక్షడు పెనుబోలు శ్యాంప్రసాద్‌రెడ్డి, ఎంపిపి దాసరి అంజమ్మ, వైస్ ఛైర్మన్ మణియాదవ్, సర్పంచ్ చెంగయ్య, సిఇఒలు శ్రీనివాసులు, గోపి తదితరులు పాల్గొన్నారు.

## వరకట్నం వేధింపుల కేసు నమోదు

కోట, మే 10 ప్రభాతవార్త

కోట మండలం తిన్నెలపూడికి చెందిన అనిల తనను తన భర్త జోసఫ్ వినీల అదనపు కట్నం కోసం తరచూ వేధిస్తున్నాడని బుధవారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. 2016లో నెల్లూరుకు చెందిన జోసఫ్‌తో వివాహం జరిగిందని తెలిపారు. అప్పట్లో రూ.50 వేల నగదు, కొంత బంగారం కట్నకానుకల కిందఇచ్చినట్లు తెలిపారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పుల్లారావు తెలిపారు.

## 30 వాహనాలపై కేసు నమోదు

కోట, మే 10 ప్రభాతవార్త

కోట, విద్యానగర్‌లలో అనుమతి పత్రాలు లేకుండా తిరుగుతున్న పలు వాహనాలపై ఎస్ఐ జి.పుల్లారావు కేసు నమోదు చేశారు. బుధవారం ఆయా గ్రామాల్లో ఎస్ఐ జి.పుల్లారావు పోలీసు సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. 30 వాహనాలకు ఎలాంటి అనుమతిపత్రాలు లేకపోవడంతో కేసులు నమోదు చేసి అపరాధ రుసుము విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

## త్వరలోనే రైతుబజార్‌ను ప్రజలకు అంకితమిస్తాం

- గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాదరావు

గూడూరు, మే 10 ప్రభాతవార్త



గూడూరు పట్టణంలో నూతనంగా నిర్మించిన రైతు బజార్‌ను అతి త్వరలో ప్రజలకు అంకితం చేస్తామని గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాదరావు తెలిపారు. గూడూరు పట్టణంలో నూతన హంగులతో ఏర్పాటు చేసిన రైతు బజారును ఆయన పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కోట పట్టణంలో దాదాపు ఒక కోటి 15 లక్షల రూపాయలతో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో గూడూరు పట్టణంలో ఎన్నడూ లేని విధంగా ఒక రైతు బజారు ఏర్పాటు చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ క్రమంలో వైసీపీ సీనియర్ నాయకులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేనమ్మ, గూడూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఓడూరు యమునమ్మ, వైస్ ఛైర్మన్ కొట్టు గోవర్ధన్, బీసీ నాయకులు అన్న మురళి, గోపాల్ యాదవ్, ముస్లిం మైనార్టీల నాయకులు అజీజ్ ఖాన్, అల్తాఫ్ బాయ్, జీనత్, పలువురు నాయకులు, మున్సిపల్ కమిషనర్ సాయినాథ్, ధర్మరాజుల స్వామి దేవస్థానం ఇఒ నవీన్, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

## డిఎస్పీ విచారణ

కోట, మే 10 ప్రభాతవార్త

కోట మండలం చిట్టేడు గ్రామంలో మూడురోజుల క్రితం కానిస్టేబుల్ వెంకటేశ్వర్లుపై అదే గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, మరికొందరు దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ కేసు విచారణ నిమిత్తం బుధవారం రాత్రి కోట పోలీసుస్టేషన్‌కు వచ్చిన గూడూరు డిఎస్పీ సూర్యనారాయణరెడ్డి విచారణ చేపట్టారు. ఆయన వెంట సిఐ హరికృష్ణ, ఎస్ఐ పుల్లారావు ఉన్నారు.

## హజ్ యాత్రికులపై భారం మోపుతున్న వైసీపీ సర్కార్

- తిరుపతి జిల్లా టిడిపి మైనార్టీ సెల్ అధ్యక్షులు జలీల్ అహ్మద్

కోట, మే 10 ప్రభాతవార్త



హజ్ యాత్రికులపై వైసీపీ సర్కార్ పెరుభారం మోపుతోందని తెలుగుదేశం పార్టీ మైనార్టీ సెల్ తిరుపతి జిల్లా అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్ ఆరోపించారు. బుధవారం ఆయన కోటలో విలేఖరులతో మాట్లాడుతూ ముస్లింలు ప్రతి సంవత్సరం మక్కా దర్శనానికి వెళ్లే హజ్ యాత్రికులపై ఎన్నడూ లేనివిధంగా అదనపు భారాన్ని మోపి హజ్ యాత్రను భారం చేస్తోందని మండిపడ్డారు. విజయవాడ నుంచి హజ్ యాత్రకు వెళ్లే ముస్లింలకు ఈ సంవత్సరం ఒకరికి దాదాపు రూ.85 వేలు అదనపు భారాన్ని మోపిందన్నారు. ఈ ఏడాది 2900 మంది యాత్రకు వెళ్లడానికి అనుమతి కోరగా, వారిలో 1900 మంది విజయవాడ నుంచి యాత్రకు వెళ్లనున్నట్లు ఆయన చెప్పారు. టిక్కెట్ ధర పక్కా రాష్ట్రాలో పోలిస్తే ఎక్కువగా ఉండటంతో హజ్‌యాత్రికులు ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. వైసీపీ ముస్లిం మైనార్టీల పక్షపాతి అని చెప్పే జగన్‌రెడ్డి ఈ విషయంలో సమాధానం చెప్పాలన్నారు.

## డంపింగ్‌యార్డ్ ప్రారంభం

గూడూరు, మే 10 ప్రభాతవార్త



గూడూరు పట్టణ సమీపంలోని డంపింగ్ యార్డ్ వద్ద లెగస్సి వేస్ట్ మేనేజ్‌మెంట్, బయో రిమిడియషన్ ప్రాసెస్ కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేనమ్మ, ఎమ్మెల్యే వరప్రసాదరావులు టెంకాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ దేవసేనమ్మ మాట్లాడుతూ పురపాలక సంఘం ఏర్పడినప్పటి నుంచి డంపింగ్ యార్డ్ తొలగించలేదన్నారు. తన హయాంలో ఈ కార్యక్రమం చేపట్టినందుకు సంతోషంగా ఉందన్నారు. చెత్తను తొలగించిన తర్వాత ఈ స్థలంలో పురపాలక సంఘానికి ఆదాయం వచ్చే పనులు చేపడతామన్నారు. వర్షాకాలం వచ్చేలోపు పనులు పూర్తి కావాలని కమిషనర్‌కు సూచించామన్నారు. ప్రజలు కూడా ఇంటి వద్దనే తడి, పొడి చెత్తను వేరు చేసి సిబ్బందికి ఇవ్వాలని కోరారు. చెత్తను వేరు చేయడం ద్వారా దాయం సమకూరుతుందని తెలిపారు. పరిశుభ్రత పాటించాలని ఆమె కోరారు. ఎమ్మెల్యే వరప్రసాదరావు మాట్లాడుతూ పురపాలక సంఘం ఛైర్‌పర్సన్‌గా దేవసేనమ్మ ఉన్నప్పటి నుంచి డంపింగ్ యార్డ్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపించారన్నారు. వైసీపీ నేత శివకుమార్‌రెడ్డి సహకారంతో సొంత నిధులు వెచ్చించి ఇక్కడ పనులు చేపట్టారని గుర్తు చేశారు. టిడిపి వారు సహకరించకపోవడంతో జాప్యం జరిగిందని ఆయన వివరించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తోట సాయినాథ్, కోదండరామయ్య, గోపాల్‌యాదవ్, అజీజ్‌ఖాన్, ముని, సాయి, ఇమ్రాన్, కొట్టు గోవర్ధన్, అన్నం మురళి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉంటా

-వైసిపి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి

వెంకటగిరి, మే 10 ప్రభాతవార్త



ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉంటానని వైసిపి జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్ తెలిపారు. బుదవారం నాడు నివాస గృహంలో ప్రజల నుండి వినతి పత్రాలను స్వీకరిం చారు.తనకు సమస్యలపై ఎప్పుడైన వచ్చి కలువవచ్చునని తెలిపారు.పార్టి కార్యలయాన్ని కూడ అందుబాటులోకి తీసుకొని వస్తు న్నట్లు చెప్పారు.సమస్యలపై తనను ఎప్పుడైనవచ్చి కలువవచ్చునని తెలిపారు. పలు సమస్యలపై నియోజవర్గ ప్రజలు వినతి పత్రాలను అందజేశారు.

## గంజాయి స్వాధీనం

పలమనేరు, మే 10 ప్రభాతవార్త:

తన పంట పొలాల్లో గంజాయి సాగు చేసి ఆకులు, రెమ్మలను ఎండబెట్టి గంజాయి అక్రమంగా విక్రయిస్తున్న ఎం.బాలాజీ(37)ను పలమనేరు పోలీసులు అరెస్టు చేసి అతని నుండి ఒక కేజీ గంజాయిని స్వాధీనం చేసుకొన్నారు. ఇతను 1.50 కేజీల గంజాయిని రెండు నెలల క్రితం పలమనేరు మదనపల్లి రోడ్డులోని దానివేళ్ అలియాస్ షబ్బీర్ విక్రయించగా బుధవారం మరో ఒక కేజీ గంజాయిని విక్రయించడానికి సిద్దం చేసుకొని వుందనే సమాచారంపై పోలీసులు అతనిని పట్టుకొని అరెస్టు చేశారు. ఈ మేరకు పోలీసులు అతనిని తహసిల్దారు కుప్పుస్వామి సమక్షంలో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

## ఫుట్‌బాల్ సమ్మర్ క్యాంప్ ప్రారంభం



**బిట్రగుంట, మే 10 ప్రభాతవార్త** మండల కేంద్రమైన బిట్రగుంట రైల్వే ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్, స్పోర్ట్స్ అథారిటి ఆఫ్ ఆంధ్రప్రదేశ్ జిల్లా క్రీడాభివృద్ధి సంస్థ సహకారంతో నిర్వహిస్తున్న ఫుట్‌బాల్ సమ్మర్ క్యాంప్‌ను బిట్రగుంట రైల్వే మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుధాకర్ ప్రారంభించారు. నెల రోజుల పాటు విద్యార్థులకు సీనియర్ ఆటగాడు మేకల కిరణ్‌కుమార్‌చే శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ పొందిన విద్యార్థులకు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ద్వారా ధృవీకరణ పత్రం అందించడంతో పాటు వాకర్స్ అసోసియేషన్ ద్వారా ఫ్యాంట్లు, జెర్సీలు క్రీడాకారులకు అందిస్తామని అసోసియేషన్ గౌరవాధ్యక్షులు ఎ.కె.సుందర్‌రాజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్.శశికుమార్, సభ్యులు చప్పిడి రవి, బత్తల రవి, సత్యనారాయణాచార్యులు, సుధాకర్, సుభాని, సీనియర్ క్రీడాకారుడు సి.హెచ్.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## అప్రకటిత విద్యుత్ కోతతో ఇక్కట్లు

**బిట్రగుంట, మే 10 ప్రభాతవార్త** బోగోలు మండలంలో గత రెండు రోజుల నుంచి రాత్రుళ్ళు, పగలు తేడా లేకుండా అప్రకటిత విద్యుత్ కోత విధిస్తుండటంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. రాత్రుళ్ల సమయంలో ఉక్కపోత, దోమల బెడదతో, పగలు ఉక్కపోతతో విద్యుత్ సరఫరా నిలిపివేయడం వల్ల వృద్ధులు, వ్యాధిగ్రస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై విద్యుత్ అధికారులను సంప్రదించగా లోడ్ రిలీఫ్ పేరుతో ఉన్నతాధికారులే నిలిపివేస్తున్నారని చెప్పడం గమనార్హం.

## ఖాదర్ వలీ బాబా మసీదుకు మైక్‌సెట్ వితరణ



**కావలి రూరల్, మే 10 ప్రభాతవార్త** కావలి రూరల్ మండలం రాజువారిచింతలపాళెం గ్రామంలోని ఖాదర్ వలీ బాబా జెండా చెట్టు, మసీదుకు మైక్‌సెట్‌ను కలిగిరి మండలం ఎరుకులరెడ్డిపాళెం గ్రామానికి చెందిన ప్రముఖ బిల్డర్ షేక్ ఖాజా మస్తాన్ వితరణ చేశారు. ఈ సందర్భంగా ఖాజా మస్తాన్‌ను మసీదు కమిటీ సభ్యు లు, ముస్లిం సోదరులు దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం మసీదు కమిటీ సభ్యులు మా ట్లాడుతూ అడిగిన వెంటనే ఏమి ఆలోచించకుండా ఖాజామస్తాన్ మైక్‌సెట్‌ను వితరణ చేయడం చాలా సంతో షంగా వుందని తెలిపారు. ఆయనకు, ఆయన కుటుంబ సభ్యులకు ఖాదర్ వలీ బాబా ఆశీస్సులు ఎల్లవేళలా వుంటాయని తెలిపారు. షేక్ ఖాజామస్తాన్ మాట్లాడుతూ ఖాదర్‌వలీ బాబా మసీదుకు తనవంతు సహకారం అందించడం చాలా సంతోషంగా వుందన్నారు. రాబోవు రోజుల్లో కూడా తన సహాయ సహకారాలు వుంటా యని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వేముల రాజేంద్ర, మాజీ ఎంపిటిసి దేవరపల్లి వెంకటేశ్వరరెడ్డి, మసీదు కమిటీ అధ్యక్షులు ఎస్.కె.జిలానీబాషా, కార్యదర్శి మహబూబుబాషా, కోశాధికారి షేక్ కరీముల్లా, షేక్ మస్తాన్, ఇసి మెంబర్స్ హజరతుల్లా, బాబ్‌జాన్, హజన్‌బాషా, ఖాజా, దస్తగిరి, బాదుషావలి, తదితరులు పాల్గొన్నారు.

## కావలిలో ప్రశాంతంగా పాలిసెట్ పరీక్ష



**కావలి రూరల్, మే 10 ప్రభాతవార్త** పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి 2023 పాలిసెట్ పరీక్ష బుధవారం ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్షకు కావలిలో 777 మంది దరఖాస్తు చేసుకోగా వీరికి సెంటర్ కోఆర్డినేటర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.సునీల్‌కుమార్ ప్రియ రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పరీక్షకు 681 మంది విద్యార్థులు హాజరుకాగా 87.67 శాతం నమోదైంది. ఈ పరీక్షకు రెవెన్యూ శాఖ డిప్యూటీ తహశీల్దార్ కె.భరత్, కావలి, జలదంకి ఎంఇవో శ్రీధర్‌లు స్పెషల్ స్క్వాడ్‌గా పర్యవేక్షించారు. గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.సునీల్‌కుమార్ ప్రియ విద్యా ర్థులకు అన్ని సౌకర్యాలు కల్పించి ఈ పరీక్ష ప్రశాంతంగా జరిగేందుకు కృషి చేశారు. ఇందుకు సహకరించిన రెవెన్యూ అధికారులకు, మున్సిపల్ అధికారులకు, విద్యుత్ అధికారులకు, ఆర్టీసి అధికారులకు, సిబ్బందికి, మెడికల్ డిపార్ట్‌మెంట్‌కు పేరుపేరున ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## కోదండరామస్వామి ఆలయం రంగులకు శివుని వితరణ



కోవూరు, మే 10 ప్రభాతవార్త : కోవూరులోని కోదండరామస్వామి ఆలయంలో ఆలయ శిఖరానికి సంబం ధించి రంగులు వేసేందుకు గానూ కోవూరు మండ పరిషత్ ఉపాధ్యక్షుడు శివుని నరసింహులురెడ్డి 1.50 లక్షల నగదును రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యులు నిరంజన్‌బాబు రెడ్డి చేతుల మీదుగా ఆలయ చైర్మన్ కాటంరెడ్డి కృష్ణారెడ్డికి అందజేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ దేవస్థానం అభివృద్ధికి ఇప్పటికే ఆలయ చైర్మన్ నిర్విరామంగా కృషి చేస్తున్నారన్నారు. గతంలో ఎప్పుడో నిర్మాణం చేసిన ఈ ఆల యానికి ఒక నూతన రూపు వచ్చేలా చైర్మన్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. అదేవిధంగా ఈ ఆలయ నిర్మాణానికి సంబంధించి గాలి గోపురం శిఖరానికి పెయింట్లు వేసేందుకు గాను నరసింహులురెడ్డి ప్రత్యేకంగా చొరవ తీసుకుని 1.50 లక్షల నిధులు అందజేయడం ఇతరులకు స్ఫూర్తిదాయకమన్నారు. ఈ సందర్భంగా ఆయ నను ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పడుగుపాడు సొసైటీ చైర్మన్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ ప్రసాద్, వెంకటేశ్వర్లురెడ్డి, రమేష్‌బాబు, ఉన్నారు.

## రైతుల శ్రేయస్సు కొరకే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు



**కలువాయి మే 10 ప్రభాతవార్త** రైతులు పండించిన పంటను దళారి వ్యవస్థ ద్వారా రైతులకు నష్టం వాటిల్లకుండా ప్రభుత్వమే వారి శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని జడ్‌పిటిసి బులగాకుల అనీల్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని తోపుగుంట ఆర్‌బికె పరిధిలో బుధవారం జొన్నలు కొనుగోలు కేంద్రాన్ని జడ్‌పిటిసి అనీల్‌కుమార్‌రెడ్డి వ్యవసాయాధికారి జి ప్రతాప్‌లు ప్రారంభించడం జరిగింది. కొనుగోలు కేంద్రం ద్వారా సేకరించిన జొన్నలను సొసైటీ నుండి సివిల్ సప్లయికి అందిచండం జరుగుతుందని ఎఒ తెలిపారు. కింటాకు 2 వేల 9 వందల 70 రూపాయాలు చెల్లించడం జరుగుతందని నాణ్యమైన జొన్నలను అందించాలని రైతులను ఈ సందర్భంగా కోరారు. అంతర్జాతీయ చిరుధాన్యల దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం సేకరించిన చిరుధాన్యాలను ప్రజానికానికి పోషకాహారాన్ని అందించే ప్రక్రియలో భాగంగా అందుబాటులోకి తేనుందని వ్యవసాయాధికారి తెలిపారు. ఈకార్యక్రమంలో తోపుగుంట సర్పంచ్ నాపా నిఖిల్, ఏఎబి చైర్మన్ మన్నెం చంద్రబాబు, ఎంపిటిసి ప్రసాద్‌నాయుడు, నాయకులు, నాపా రాఘవేంద్ర, మాదాల రమేష్, ఎర్రమనేని వెంకటేశ్వర్లు, ఏఇఒ అనితా, సొసైటీ అధికారి సుదర్శనరెడ్డి, ఆర్‌బికె సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

## 60వ సారి రక్తదానం చేసిన హనుమకుమార్




**కావలి, మే 10 ప్రభాతవార్త** కావలి రెడ్‌క్రాస్ పాఠశాల విద్యార్థుల విభాగం జూనియర్ రెడ్‌క్రాస్ కన్వీనర్ అన్నవరం శ్రీనివాసరావు సేవా సంస్థ వ్యవస్థాపకులు ఎ.వి.హనుమకుమార్ 60వ సారి రక్తదానం చేసి అందరి ప్రశంసలు అందుకున్నారు. కావలి రెడ్‌క్రాస్ రక్తకేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆయన రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ జిల్లా వైస్ చైర్మన్ దామిశెట్టి సుధీర్‌నాయుడు, కావలి శాఖ చైర్మన్ దాకారపు రవిప్రకాష్, రక్త కేంద్రం మేనేజర్ బి.ఎస్.ప్రసాద్, రక్త కేంద్రం సిబ్బంది ఆయనను అభినందించారు.

## జమ్మిపాలెంలో సిటీ వైసీపీ నేతల ఇసుక దందా



**కోవూరు, మే 10 ప్రభాతవార్త :** కోవూరు మండలం జమ్మిపాలెం గ్రామంలో సిటీ శాసనసభ్యులు అనిల్‌కుమార్ అనుచరులు తమ ఇష్టానుసారంగా కోట్లాది రూపాయల ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నా సంబంధిత శాఖలో ఎటువంటి స్పందన లేదని జనసేన జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి జి. కిషోర్ ఉపాధ్యక్షుడు బి. సుధీర్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం వారు జమ్మిపాలెం ఇసుక రీచ్‌ను నిశితంగా పరిశీలించి అనంతరం వారు మాట్లాడుతూ అక్రమ దందా చేస్తున్న ఈ ట్రాక్టర్లకు ఎటువంటి అనుమతులు లేవని, రోజుకు వందల ట్రాక్టర్లలో ఇసుక జగనన్న లేఅవుట్ల పేరుతో అక్రమ రవాణా సాగుతుందన్నారు. భూగర్భ గనుల శాఖగానీ, రెవెన్యూ శాఖగానీ ఈ విషయంలో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు తప్ప వారిలో ఎటువంటి స్పందన లేదన్నారు. అవసరం అయితే ఈ విషయంలో జిల్లా స్థాయిలో జనసేన పార్టీ ద్వారా పోరాడేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అక్రమ రవాణా ఆగేంతవరకు తమ పోరాటం ఆగదన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ప్రశాంత్‌గౌడ్, సిటీ కార్యదర్శి హేమచంద్ర యాదవ్, ప్రసన్న, ఉన్నారు.

## మతమార్పిడిలు జరగడం సరికాదు



**కోవూరు, మే 10 ప్రభాతవార్త** : కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీ చంద్రమౌళినగర్‌లో మంగళవారం 5 సంవత్సరాల వయస్సు ఉన్న పిల్లలను చర్చిలకు పంపాలని ప్రచారం చేస్తుంటే దానిని వ్యతి రేకించిన తమపై పాస్టర్లు దౌర్జన్యం చేయడం సరికాదని నెల్లూరు జిల్లా బీజేపీ ఎసీస మోర్చా అధ్యక్షుడు పి. శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం కోవూరు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో బాలబాలికలను మత మారినపడి పేరుతో వారి భవిష్యత్తును నాశనం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి చర్యల పట్ల తాము విరుద్ధమని, మత మార్పిడి పేరుతో పిల్లల మనస్సులను కలుషితం చేస్తున్న ఇటువంటి కార్యక్రమాలు తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. ప్రదానంగా ఆయా ప్రాంతాల్లో యానాదులను టార్గెట్ చేసుకుని క్రిస్టియన్ మతంలోకి మార్చడంపై తాము అభ్యంతరం తెలియజేస్తున్నామన్నారు. ఇటువంటి వాటిపై వెంటనే తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నమామిగంగే ప్రముఖ్ ఎం. రమేష్, మండలాధ్యక్షుడు ఐ.రఘురామయ్య, ప్రధాన కార్యదర్శి బి. నగేష్, ఉపాధ్యక్షుడు కె. పెంచల్‌రెడ్డి, మండల కిసాన్ మోర్చా అధ్యక్షుడు పి. సుబ్బారావు, కార్యదర్శి ఎం. పూర్ణచంద్రరావు, జనార్ధన్, తదితరులు ఉన్నారు.

## వైభవంగా పల్లకి సేవ



**కోవూరు, మే 10 ప్రభాతవార్త :** కోవూరులో వెలసి ఉన్న వీరాంజనేయ స్వామి దేవస్థానంలో హనుమత్ జయంతి ఉత్సవాల్లో భాగంగా బుధవారం ప్రాతఃకాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజాచార్యుల ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం , సహస్ర నామార్చన, నాగవల్లి పత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి పూలంగి సేవ, పల్లకి సేవ కార్యక్రమాలను కన్నులపండువగా చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా మొలకల శ్రీధర్‌రెడ్డి, సురేష్‌రెడ్డి కుటుంబ సభ్యులు వ్యవ హరించారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుద్దీపాలతో అత్యంత వైభవంగా అలంకరించారు. పల్లకి సేవ కార్యక్రమంలో రుత్వికులు సుబ్బయ్య స్వామి, నందకుమార్ స్వామి, భక్తులు ఉన్నారు.

## పుస్తకపఠనం ద్వారా ఆలోచనా శక్తి పెరుగుతుంది



రాపూరు, మే10ప్రభాతవార్త పుస్తక పఠనం ద్వారా విద్యార్థుల ఆలోచనా శక్తి పెరుగుతుందని రాపూరు గ్రంథాలయ అధికారిణి ధనమ్మ తెలిపారు. వేసవి శిక్షణా కార్యక్రమంలో బాగంగా బుదవారం పలువురు విద్యార్దులు గ్రంథాలయానికి రాగా వారికి పుస్తకపఠనం ద్వారా చేకూరే లాభాలను వివరించారు. ప్రతి ఒక్క రు క్రమం తప్పకుండా పుస్తక పఠనం అలవాటు చేసుకోవడంద్వారా ప్రపంచ జ్ఞానం పెరుగుతుందని తెలి పారు. ప్రతి విద్యార్థి వేసవి శిక్షణా శిభిరాలను సద్వినియోగం చేసుకోవాలనిఆమె కోరారు. ఈ కార్యక్రమంలో సహాయకుడు వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

## ఘనంగా రెడ్‌క్రాస్‌లో తలసేమియా దినోత్సవం




**నెల్లూరు మే 10, ప్రభాతవార్త-వైద్యం** ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నెల్లూరు జిల్లా శాఖలో బుధవారం మద్రాసు బస్టాండు సమీపంలో ఉన్న సమావేశ మందిరంలో అంర్జాతీయ తలసేమియా దొనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ బ్లడ్ సెంటర్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఏ.యశోవర్ధన్ మాట్లాడుతూ అంతర్జాతీయ తలసేమియా దినోత్సవం థీమ్ బీవేర్, షేర్, కేర్ స్ట్రెంథనింగ్ ఎడ్యుకేషన్ టు బ్రిడ్జ్ తలసేమియా కేర్ గ్యాస్ ద్వారా ప్రభావితమైన వ్యక్తులను, నవీనమైన పద్ధతుల ద్వారా నిర్ధారించడం సహాయపడుతుందన్నారు. వైద్యులు, ఇతర ఆరోగ్య సంరక్షణ నిపుణులకు తలసేమియా గురించిన తాజా సమాచారం అందించడం, ప్రజలకు ఈవ్యాధిపై అవగాహన కల్పించాలని కోరారు. ఇండియన్ రెడ్‌క్రాస్ తలసేమియా ప్రాజెక్టు కన్వీనర్ డాక్టర్ ఎస్.సీత మాట్లాడుతూ రెడ్‌క్రాస్ తలసేమియా డే కేర్ సెంటర్లో నమోదు చేసుకున్న చిన్నారులందరూ తలసేమియా రహితులుగా మార్చాలని, దానికోసం అందరు సహాయ సహకారాలు అందించాలని కోరారు. తలసేమియా చిన్నారులకు వారంలో ఒకరోజు ఉచితముగా వైద్యం ఉచితంగా అందిస్తున్న డాక్టర్ యు.రమ్యను వారు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యుడు దాసరి.రాజేంద్రప్రసాద్, లైన్స్ క్లబ్ ఆఫ్ ప్రియదర్శిని, మహాయాగ ట్రస్టు, బిఎంజి ఫౌండేషన్, సంకల్ప్ ఫౌండేషన్, ప్యూర్ స్మైల్ ఛారిటీస్, డాక్టర్‌లను, సేవాభావంతో పనిచేస్తున్న వాలంటీర్లను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. ఈ దినోత్సవ కార్యక్రమంలో ఆ సొసైటీ కోశాధికారి సురేష్‌కుమార్‌జైన్, జిల్లా కార్యదర్శి మస్తానయ్య, యడవల్లి.సురేష్, రెడ్‌క్రాస్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ జివి.రవికుమార్, క్యాన్సర్ ఆసుపత్రి జనరల్ అడ్మినిస్ట్రేషన్ మేనేజర్ యండి.జుబేర్, రెడ్‌క్రాస్ కన్వీనర్లు ఎంవి.సుబ్బారెడ్డి, మురళి, డాక్టర్ టి.రంజని, పి.ప్రవీణా, కోకన్వీనర్లు పర్వీన్, కె.సురేఖ, డాక్టర్లు సి.హరిత, శిరీష, ఎం.విష్ణువందన, కె.భార్గవి, పి.హరితారాణి రెడ్‌క్రాస్ జీవితకాల సభ్యులు, స్వచ్ఛంద సేవకులు, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వాలంటీర్ పోస్టులకు 15 లోగా దరఖాస్తు చేసుకోండి

**బిట్రగుంట, మే 10 ప్రభాతవార్త** బోగోలు మండలంలో ఖాళీగా వున్న జువ్వలదిన్నె(బిసి సి పురుషులు), నాగులవరం(ఎస్సీ మహిళ) గ్రామాల వాలంటీర్ పోస్టులకు ఈ నెల 15 లోగా దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపిడివో సి.హెచ్.శ్రీదేవి ఒక ప్రకటనలో కోరారు. వాలంటీర్‌గా దరఖాస్తు చేసుకునే వారు స్థానికులై 10వ తరగతి ఉత్తీర్ణులై వుండాలని తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని మిగిలిన వివరాలకు ఆయా గ్రామ సచివాలయ కార్యదర్శులను సంప్రదించాలని కోరారు.

## 16న అంతర్జాతీయ డెంగ్యూ దినోత్సవం

**నెల్లూరు మే 10, ప్రభాతవార్త-వైద్యం** ఈనెల 16న అంతర్జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా ప్రతి ఆరోగ్య కేంద్రం పరిధిలో అవగాహన ర్యాలీలు, గ్రూప్ సమావేశాలు నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.పెంచలయ్య పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని డీఎంహెచ్ఓ కార్యాలయంలో ఆయన ఛాంబర్‌లో జిల్లా సబ్ యూనిట్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ ఈనెల 16న జరగబోవు అంతర్జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించాలన్నారు. అలాగే ఈనెలా ఖరులోపు అన్ని హాస్టల్స్, రెసిడెన్షియల్స్ స్కూల్సులో స్ప్రేయింగ్ నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ బ్రిజిత, సబ్‌యూనిట్ అధికారులు పాల్గొన్నారు.

## జగనన్న కాలనీ ఇండ్లకు శంకుస్థాపన చేసిన సర్పంచ్ ఆనం



**సంగం మే 10 ప్రభాతవార్త** సంగం మండలం వెంగారెడ్డిపాళెంగ్రామంలో జగన్న కాలనీ ఇండ్లకు గ్రామ సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు తమ గ్రామానికి 35 ఇండ్లు మంజూరు అయినట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర చరిత్రలో ఇంతవరకు ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి గ్రామానికి ఇండ్ల స్థలాలు మంజూరు చేసి అందులో పక్కాగృహాలు నిర్మించడం ఒ అద్భుతమని ఆయన కొనియాడారు. ఆత్మకూరు శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి సహకారంతో ఈ గృహనిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేస్తామని ఆయన తెలి పారు. ఈకార్యక్రమంలో హౌసింగ్ ఏఇ ఖరిముల్లా సెక్రటరి లక్ష్మీలావణ్య, ఇంజనీరింగ్ అసిస్టెంట్ శివశంకర్‌రెడ్డి, వాలింటరీలు, లబ్దిదారులు ఉన్నారు.

## కర్నాటకలో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలి



వింజమూరు, మే10ప్రభాతవార్త: కర్నాటక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని ఉదయగిరి నియోజకవర్గ పిసిసి అధ్యక్షులు మద్దూరు రాజగోపాల్‌రెడ్డి బుధవారం ఆళ్ళగడ్డలోని రుద్రవరం వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వ హించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాహుల్‌గాంధీ నేతృత్వంలో కర్నాటక ఎన్నికల బరిలో నిలిచిన కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థులందరూ బుధవారం జరిగిన ఎన్నికల్లో విజయం సాధించాలని ఆయన పూజలు నిర్వహించారు.

## తోపుడు బండి అందజేసిన ఇంటూరి




కందుకూరు, మే10, ప్రభాతవార్త కందుకూరు పట్టణం 25వ వార్డు కొత్తకుమ్మరిపాలెంలో నివాసముండే కలికివాయి సుజాత, కూరగాయల వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. ఆర్థిక ఇబ్బందులు పడుతున్న ఆ కుటుంబానికి తోడుగా నిలిచేందుకు కందుకూరు తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు బుధవారం సుజాతకు తోపుడు బండిఅందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అద్యక్షులు దామా మల్లేశ్వరరావు, వార్డు నాయకులు గుర్రం మల్లికార్జున, నియోజకవర్గ టిడిపి అధ్యక్షులు నాదెండ్ల వెంకట సుబ్బారావు, నెల్లూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి గోచిపాతలమోషే, పట్టణ ఉపాధ్యక్షులు వడ్డేళ్ల రవిచంద్ర, పార్టీ నాయకులు బద్దిపూడి శిఖామణి, మణికే మల్యాద్రి, జడ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఇంటూరి



ఉలవపాడు, మే10, ప్రభాతవార్త ఉలవపాడు మండలం కరేడు పంచాయతీ ఆకుతోట సంఘం ఎస్టీ కాలనీలో బుధవారం సీతారాముల విగ్రహప్రతిష్ట, స్వామివారి కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా కందుకూరునియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో గ్రామపార్టీ అధ్యక్షుడు కన్నా ప్రసాద్, నాయకులు కత్తి ప్రసాద్, కత్తి నారాయణ, కత్తి వెంకటేశ్వర్లు, కత్తి ఆక్కులు, కొత్తపల్లి శ్రీనివాసులు, చౌటూరి కోటేశ్వర రావు, పాలుబోయిన శ్రీనివాసులు, మెట్టా శ్రీనివాసులురెడ్డి, జెట్టి సుబ్బరామిరెడ్డి, కొలింల వెంకటరమణ, వెంకట్రావు, బాబులు, రేగలగడ్డ తేజ, పెల్లేటి పోలిరెడ్డి, రాచగర్ల శివ, చింతల సింగయ్య, మట్టెపు సురేంద్ర, అంచుపోగు వాసు, కాటాబత్తిన వెంకటేశ్వర్లు, చిరుతోటి గిరిబాబు, బడితల శివప్రసాద్, బాపనపల్లి పవన్‌కుమార్, చిమ్మిరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## వేసవి శిక్షణా తరగతులు



ఉలవపాడు, మే10, ప్రభాతవార్తఉలవపాడుశాఖ గ్రంధాలయంలో ముందుగా పిల్లలతో పుస్తక పఠనం చేయించి, నీతి కథలు చెప్పించి అనంతరం విద్యార్థుల కోరికమేరకు చిత్రలేఖనం పోటీలునిర్వహించారు. ఇందులో మొత్తం 33మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిరోజూ జరిగే ఈ వేసవి శిక్షణా తరగతులలో చదువుతోపాటు వారిలో దాగిఉన్న సృజనాత్మక శక్తిని వెలికితీసేందుకు ఇలాంటివి వారంపాటు నిర్వహించి వారం చివరిలో గెలుపొందిన విజేతలకు ముఖ్యఅతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేయడం జరుగుతుందని గ్రంధపాలకులు డి.కోటేశ్వరరావు తెలిపారు.

## పంచాయితీ తీరు మారకపోతే పంచాయితీ ముట్టడి చేస్తాం

**రాపూరు, మే10ప్రభాతవార్త** మేజర్ పంచాయితీలో పాలన గాడి తప్పిందని ఇప్పటికైనా పంచాయితీ అధికారుల తీరు మారకుంటే పంచాయితీనీముట్టడిస్తామని తిరుపతి పార్లమెంటు మైనారిటీ ఉపాధ్యాక్షుడు, రాపూరు పట్టణ టిడిపి ఆధ్యక్షుడు షేక్ ముక్తియార్ ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయితీలో ఎక్కడా సైడు కాలువలు శుభ్రపరచడం లేదని, పంచాయితీలో విచ్చల విడిగావున్న పందులు ,కుక్క లు, కోతులపై ఎన్ని అర్జీలు ఇచ్చినా వాటిని పాలకులు కాని అధికారులు కాని పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. రాపూరులో రోగలతో కూడిన గజ్జి కుక్కలు విధులలో సంచరిస్తూ ప్రజలపై దాడులు చేస్తు న్నాయన్నారు. ఈ సమస్యలపై అనేక పర్యాయాలు పంచాయితీ కార్యదర్శికి, యంపీడీఓకు వినతి పత్రాలు ఇచ్చినా ఎటువంటి పరిష్కారం లభించలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ సమస్యలు పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున పంచాయితీ కార్యలయాన్ని ముట్టడిస్తామని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

## వివాహ వేడుకలలో పాల్గొన్న మాజీ మంత్రి ఆనం



**సంగం మే 10 ప్రభాతవార్త** మండల కేంద్రమైన సంగంలో నూతల పాటి శ్రీహరినాయుడు,అమ్మణి కుమార్తె భానప్రియ వివాహ మహోత్సవానికి మాజీ మంత్రి వెంకటగిరి శాసనసభ్యులు ఆనం రామానారాయణరెడ్డి హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయనను పెద్దఎత్తున నేతలు కలిశారు. వైసిపి నాయకులు ఆనం ప్రసాద్‌రెడ్డి,గంగపట్నం చంద్రశేఖరయ్య,కోటు కరుణాకర్‌రెడ్డి,మందిపాటి హరిరెడ్డి, చేవూరు జనార్ధన్‌రెడ్డి, ముత్యాల మోహన్‌రావు, సంగం మాజీ సర్పంచ్ కండిబోయిన శేషయ్య,నెల్లూరు కోటారెడ్డి, టిడిపి నాయకులు ఎస్‌కె బాబు, శ్రీనివాసులునాయుడు, బాణా శ్రీనివాసులురెడ్డి, గునుపూడి గిరి,మాగం గిరి,పెంచలనాయుడు, పలువురు ఆయనను కలవగా ఆయన ఆప్యాయతగా అందర్ని పలకరించారు.

## రుద్రకోట సచివాలయాన్ని తనిఖీ చేసిన కనకదుర్గా భవాని



**కావలి రూరల్, మే 10 ప్రభాతవార్త** కావలి రూరల్ మండలంలోని రుద్రకోట గ్రామ సచివాలయాన్ని బుధవారం కావలి డివిజనల్ అభివృద్ధి అధికారిణి ఎస్.కనకదుర్గాభవాని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బందితో ఎస్‌డిజి సర్వే పురోగతిపై చర్చి తగు సూచనలు, సలహాలు అందజేశారు. ప్రైవేట్ పాఠశాలలో 1వ తరగతికి పేద పిల్లలకు ఉచిత విద్య నమోదు గురించి తెలియజేశారు. హౌసింగ్ కాలనీ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పశుగణాభివృద్ధి చైర్మన్‌కు ఘన సన్మానం



**కోవూరు, మే 10 ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పశు గణాభివృద్ధి సంఘం చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన గొల్లపల్లి విజయ్‌కుమార్‌ను డీఎల్‌డీఏ డైరెక్టర్లు , అధికారులు ఘనంగా శాలువా, పూలమాల, మెమెంటోతో సత్కరించి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మహేశ్వరుడు, డీఎల్‌డీఏ ఎగ్జిక్యూటివ్ అధికారి డాక్టర్ సోమయ్య, మాజీ చైర్మన్ సీహెచ్ కృష్ణారెడ్డి, డాక్టర్ వసంతరాయలు, డైరెక్టర్లు మల్లికార్జున్‌రావు, రమణయ్య, సునీల్‌రెడ్డి, సుగుణమ్మ, తదితరులు ఉన్నారు.

## గోపాలమిత్ర సమస్యలపై ప్రత్యేక దృష్టి



**కోవూరు, మే 10 ప్రభాతవార్త :** రాష్ట్రంలో పాడి పరిశ్రమ అభివృద్ధికి తమవంతుగా కృషి చేస్తున్న గోపాల మిత్రుల సమస్యలపై పశుసంవర్ధక శాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో ప్రత్యేకంగా చర్చించడం జరిగిందని, రానున్న రోజుల్లో వారి సంక్షేమానికి ప్రత్యేక దృష్టి సారిస్తానని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పశుగణాభివృద్ధి సంఘం చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్ తెలిపారు. కోవూరులోని కొత్తూరులో ఉన్న జిల్లా పశుగణాభివృదినథ సంఘం కార్యాలయంలో బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశు సంవర్ధక శాఖ, పశుగణాభివృద్ధి సంఘం సమన్వయంతో సమిష్టిగా కృషి చేస్తే పాల ఉతనపత్తి ఘననీయంగా పెరిగేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రజలకు నాణ్యమైన పాలు అందించాలన్నదే తమ ప్రధాన ధ్యేయమన్నారు. రాష్ట్రంలోని ప్రతి ఇంటిలో ఒక ఒంగోలు జాతి ఆవు ఉండేలా చర్యలు తీసు కోవాలని నిర్ణయించుకున్నామన్నారు. ఇప్పటికే గోపాలమిత్రులు కేవలం తక్కువ పారితోషకంతో విధులు నిర్వ హిస్తున్నారని, వారి సమస్యలపై ప్రత్యేకంగా చర్చించి జిల్లాలో వారికి రావాల్సిన 2.59 లక్షల నిధులను విడుదల చేసేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా 30 మేలు జాతి మగదూడలకు గానూ ఇప్పటివరకు 16 మగ దూడలను 14 ఒంగోలు జాతి దూడలను, 2 ముర్రా జాతి దూడలను జిల్లాలో పంపిణీ చేయడం జరిగిందన్నారు. తనకు ఈ రాష్ట్రస్థాయి పదవి వచ్చేందుకు ప్రత్యేకంగా కృషి చేసిన కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ కె. రంగారెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. కేవలం ఈ పదవిని బీసీ కులానికి చెందిన యాదవులకు ఇవ్వాలని ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకోవడం తన అదృష్టంగా భావిస్తున్నామన్నారు. అంతే కాకుండా రాష్ట్రంలోని మంత్రులు, ఎమ్మెల్యేలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. అదేవిధంగా యాదవులకు ఈ పదవి ఇవ్వాలని నిర్ణయించిన ముఖ్యమంత్రికి కూడా తమవంతు ధన్యవాదాలు తెలియజేస్తున్నామని, ఈ పదవికి వన్నె తెచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా జాతీయ కృత్రియ గర్భధారణ చేసిన గోపాలమిత్రులకు., పశు సంవర్ధక శాఖ సిబ్బందికి మంజూరు చేసిన చెక్కును గోపాలమిత్రులకు అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ జేడీ డాక్టర్ మహే శ్వరుడు, డీఎల్‌డీఏ ఎగ్జిక్యూటివ్ అధికారి డాక్టర్ సోమయ్య, మాజీ చైర్మన్ సీహెచ్ కృష్ణారెడ్డి, తదితరులు పలు సూచనలు చేశారు.

## నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడుగా పెంచలనాయుడు



**నెల్లూరు మే 10, ప్రభాతవార్త-వైద్యం** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా.చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు, రాష్ట్ర అధ్యక్షుడు కింజెరపు.అచ్చెన్నాయుడు సూచనలతో తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడుగా మాజీ కార్పొరేటర్ మన్నెం.పెంచలనాయుడుని నియమించినట్లు తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంటు అధ్యక్షుడు, నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ షేక్.అబ్దుల్‌అజీజ్ బుధవారం తెలుగుదేశం పార్టీ జిల్లా కేంద్ర కార్యాలయం నుండి విడుదల చేసిన ఒ ప్రకటనలో పేర్కొన్నారు.

## నెల్లూరు పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధిగా బాలాజీ



**నెల్లూరు మే 10, ప్రభాతవార్త-వైద్యం** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా.చంద్రబాబునాయుడు ఆదేశాలతో, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు కింజెరపు.అచ్చెన్నాయుడు సూచనలతో, తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు, నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ షేక్.అబ్దుల్‌అజీజ్ కువ్వారపు.బాలాజీని నెల్లూరు పార్లమెంటు అధికార ప్రతినిధిగా నియమించినట్లు బుధవారం టీడీపీ జిల్లా కేంద్ర కార్యాలయం నుండి వెలువడిన ఒ ప్రకటనలో తెలిపారు.

## అర్ధగంటకే ముగిసిన సర్వసభ్య సమావేశం



సైదాపురం మే 10 ప్రభాతవార్త మండలస్థాయి అభివృద్ధి,ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎంపిపి అధ్యక్షతన అన్ని శాఖల అధికారులు,ప్రజా ప్రతినిదులతో ఏర్పాటు చేసే మండల సర్వసభ్య సమావేశంలో బుధవారం మొక్కుబడిగా నిర్వహించారు.దీంతో విమర్శలకు తావిచింది. గ్రామాలలోని సమస్యల పరిష్కారం కోసం గాని అభివృద్ధిపైన ఏలాంటి చర్చ లేకుండానే ఈ సమావేశంలో కేవల అర్ధగంటలో అదికారులు ముగించడంతో సర వ్వత్రా చర్చీన్యాంశం అయింది.అదే విధంగా జడ్‌పిటిసి సభ్యులు చిత్తలూరు పోలయ్యకు కూర్చునుందేకు అధికారులు కుర్చీకూడా ఇవ్వకపోవడంతో ఆయన కొద్ది సేపు నిలబడి వెళ్లిపోయారు. దీంతో పాలయ్య మాట్లాడుతు కేవలం దళితుడనే నన్ను అవమానించారని ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు.ఈకార్యక్రమంలో మండల ఆయాశాఖ అధికారులు ప్రజాప్రతినిదులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ మద్యం దుకాణాలను తనీఖి చేసిన అదికారులు



**సీతారామపురం మే 10 ప్రభాతవార్త** సీతారామపురం మండలంలోని కల్లూరు ప్రభుత్వ మద్యం దుకాణాలను నెల్లూరు ప్రొబిషన్ అండ్ ఎకె స్సైజ్ ఎస్ఐ శ్రీనివాసులు ఆఖస్మికంగా తనీఖి చేశారు.రికార్డులను పరిశీలించి మద్యం బాటిల్ ్స కల్లు నమూనాలను పరిశీలించారు.అనంతరం ఆయన మాట్లాడుతు జిల్లా ప్రో హిబిషన్,ఎక్సైజ్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం మర్రిపాడు,ఉదయగిరి సీతారామ పురం, వరికుంటపాడు, తదితరప్రాంతాలలో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణాలను తనీఖి చేసినట్లు తెలిపారు. మద్యం దుకాణాలలో నాణ్యత ప్రమాణాలను పాటించాలని కల్లుదుకాణ ఎఫ్‌టిఎఫ్‌లకు సూచినలు చేస్తున్నామని అన్నారు. మద్యం దుకాణాలలో అమ్మకాలు జరిపిన నగదును మరుసటి రోజు క్రమం తప్పకుండా సక్రమంగా బ్యాంకులో జమ చేయాలని అన్నారు.బ్యాంకు నందుజమ చేసిన నగదు రసీదులను క్షుణ్ణంగా పరిశీలించామని అన్నారు.ప్రతి బాటిల్‌ను స్కాన్ చేసి అమ్మాలని అన్నారు. మద్యం బాటిల్ ్సను ఎంఆర్‌పి కంటే ఎక్కువకు అమ్మరాదని అలా అమ్మిన వారిపైన చర్యలు తప్పవని అన్నారు.

## కావలి ఎమ్మెల్యే ప్రతాపన్న దోపిడీ జగనన్నకు చెబుదాం




**కావలి, మే 10 ప్రభాతవార్త** కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి దోపిడీ, అరాచకాలను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి చెబుదామంటూ కావలి పట్టణంలోని అఖిలపక్ష పార్టీల నేతలు తీవ్రస్థాయిలో అవినీతి ఆరోపణాస్త్రాలు సంధిస్తూ ధ్వజమెత్తారు. కావలి పట్టణం రైల్వే రోడ్డులోని జర్నలిస్ట్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అఖిలపక్ష పార్టీలకు చెందిన నేతలు ప్రముఖ న్యాయవాది చింతాల వెంకట్రావు(కాంగ్రెస్), పసుపులేటి పెంచలయ్య(సిపియం), జ్యోతిబాబురావు(టిడిపి), కరవది భాస్కర్(సిపిఐయంయల్), కొప్పర్తి నాగరాజు (సిపిఐ), పొబ్బా సాయివిఠల్ (జనసేన)లు మాట్లాడారు. జగనన్నకు చెబుదాం అని వైసిపి పార్టీ ఒక ప్రోగ్రామ్ పెట్టారన్నారు. అందుకే కావలి ఎమ్మెల్యే అవినీతి చిట్టా బాగోతంపై జగనన్నకు మేము చెబుదామన్నారు. కావలిలో కణంకణం కబ్జా, అణువణువునా అవినీతి, దిక్కుదిక్కులా దోపిడీ పేరుతో ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి రాష్ట్రంలో లేని విధంగా అవినీతి చిట్టా పేరుకుపోయిందన్నారు. వైసిపి నాలుగేళ్ల పాలనలో ఎమ్మెల్యే చేసిన దోపిడీలు రాష్ట్రంలోనే కావలి రికార్డులు బద్దలు కొట్టారన్నారు. కావలిపై సియం జగన్ ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గతంలో ఇక్కడ జరిగిన అవినీతికి కారణం మన్నెమాల సుకుమార్‌రెడ్డి అని చెబుతూ పార్టీ నుండి సస్పెండ్ చేశారన్నారు. సుకుమార్‌రెడ్డి వున్నప్పుడు టిప్పర్ గ్రావెల్ 4 వేలు అమ్మితే ఇప్పుడు ఏడు వేల రూపాయలు అమ్ముతున్నారన్నారు. అయితే ఇప్పుడు దోపిడీకి పాల్పడుతున్న వారెవరో చెప్పాలన్నారు. సుకుమార్‌రెడ్డి అవినీతి చేసి వుంటే ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్‌రెడ్డికి సంబంధం లేకపోతే ఎందుకు విచారణ జరిపి నిజాలు నిగ్గు తేల్చకపోవడం ఏమిటని వారు ప్రశ్నించారు. ప్రస్తుతం సుకుమార్‌రెడ్డి లేకపోయినా కావలిలో గ్రావెల్, ఇసుక మాఫియాలు కొనసాగుతున్నాయన్నారు. దీనికి కారణం ఎమ్మెల్యే కాదా అని వారు ప్రశ్నించారు. బటన్ నొక్కి పరిపాలన సాగిస్తున్న సియం జగన్మోహన్‌రెడ్డి కావలికి రావడంలో మతలబు ఏమిటో చెప్పాలన్నారు. ఎమ్మెల్యేలు చేసిన అవినీతి డబ్బును హెలికాప్టర్‌లో తీసుకెళ్లేందుకు జగన్‌రెడ్డి వస్తున్నారన్న అనుమానాలు కూడా లేకపోలేదన్నారు. వైసిపి పాలనలో కావలిలో అభివృద్ధి ఏమి లేదన్నారు. అక్రమ లేఅవుట్లు రాజ్యమేలుతున్నాయన్నారు. కావలిలో రోడ్లు, డ్రైనేజి, వాటర్ సమస్యలతో ప్రజలు తల్లడిల్లిపోతున్నారన్నారు. పట్టించుకునే నాధుడే లేదన్నారు. పెద్దపవని రోడ్డులో ఫ్లైవోవర్ బ్రిడ్జి కానీ, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలనలో ఏర్పడ్డ ఇందిరమ్మ కాలనీలలో మౌలిక వసతులు లేక ప్రజలు నానా యాతనలు పడుతున్నారన్నారు. అయినా ఈ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డికి ధన దాహం తప్ప ప్రజా సమస్యలు పట్టవన్నారు. కావలిలో సామాన్యులు ఏ పని కావాలన్నా ఇన్‌కమ్‌టాక్స్, జిఎస్టీ లాగా కావలిలో టాక్స్ చెల్లించకతప్పదన్నారు. కావలిలో జరుగుతున్న దోపిడీ, భూకబ్జాలపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించి ప్రతాపన్న చెర నుంచి కావలిని కాపాడాలని వారు డిమాండ్ చేశారు. సిపిఐ నాయకులు పసుపులేటి మహేష్, టిడిపి నేత శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

## ఊపిరి ఉన్నంతవరకు వైద్యసేవలు అందిస్తా



**వింజమూరు,మే10ప్రభాతవార్త:** ఉదయగిరి నియోజకవర్గ ప్రజలకు తన ఊపిరి ఉన్నంతవరకు నిరంతరాయంగా వైద్యసేవలు అందిస్తానని రిటైర్డ్ డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ మాశిలామణి పేర్కొన్నారు. బుధవారం డాక్టర్ మాశిలామణి వైద్యశాల 9వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాశిలామణి మాట్లాడుతూ తాను ఎక్కడో చిత్తూరు జిల్లా మారుమూల పల్లెలో జన్మించినప్పటికీ ఎంతో లక్ష్యంతో వైద్య వృత్తిని చేపట్టి ఇతర రాష్ట్రాల్లో కొన్ని సంవత్సరాలు విధులు నిర్వహించినప్పటికీ తన ప్రాంతానికి వచ్చి ప్రభుత్వ వైద్యాధికారిగా బాధ్యతలు చేపట్టి ఈ ప్రాంతానికి వచ్చినప్పటి నుండి ఈ నియోజకవర్గ ప్రాంతంలోని ప్రజలు తనపై చూపుతున్న ఆదరాభిమానాలను తాను ఎన్నటికీ మరువనన్నారు. తాను వైద్యాధికారిగా ఉన్న సమయంలో విధుల్లో నిక్కచ్చిగా ఉంటూ ఎంతో మంది రోగులకు సేవలందించానన్నారు. సుమారు లక్షపై చిలుకు ట్యూబెక్టమీ కేసులను చేశానన్నారు. చిన్నపిల్లల స్పెషలిస్ట్ డాక్టర్‌గా ఈ ప్రాంతంలో వైద్యశాలను ఏర్పాటు చేసినప్పటి నుండి ఏ సమయాన వచ్చినా రోగులకు సేవలందిస్తున్నానన్నారు. ఏ వైద్యశాలలోనైనా సమయపాలనపాటిస్తూ రోగులకు వైద్యసేలందిస్తారని, కానీ తాను మాత్రం 24గంటలు వైద్యసేవలు అందిస్తానన్నారు. ఈనియోజకవర్గం నుండే కాకుండా బద్వేల్, పోరుమామిళ్ళ, ఇతర జిల్లాల నుండి కూడా తనవద్దకు రోగులు రావడం , తాను అందిస్తున్న సేవలకు నిదర్శనమన్నారు. ఇప్పటికే కార్పోరేట్ వైద్యులను సైతం వైద్యశాలకు రప్పించి వివిధరకాలను సేవలను రోగులకు అందిస్తున్నా మన్నారు. అనంతరం కేక్‌ను కట్‌చేసి అందరికి పంచిపెట్టారు . సంచార చిన్నారులకు దుస్తులు , భోజనపు ప్యాకెట్లను అందజేశారు. ఆసుపత్రి చైర్మెన్ నిర్మల, ప్రీతిక, ప్రశాంత్, సిఇఒ హెప్సిబా, సిబ్బంది మల్లిఖార్జున, కీర్తన, ప్రేమలీల, దీన, సుజిత్ , జయరాజ్, రాజు, శాలిని, విజయ్, మహేంద్రలు పాల్గొన్నారు.

## భూమిరెడ్డి వివాహ వేడుకల్లో మెట్టుకూరి



**వింజమూరు,మే10ప్రభాతవార్త:** వింజమూరు మండలం శంఖవరంకు చెందిన భూమిరెడ్డి నర్సింహారెడ్డి-వరలక్ష్మిల కుమార్తె హిమబిందు వివాహానికి రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మెన్ మెట్టుకూరు చిరంజీవిరెడ్డి బుధవారం హాజరై వధువును ఆశీర్వదించారు. అనంతరం సర్పంచ్ భోగిరెడ్డి మల్లీశ్వరి- ఓబులరెడ్డి నివాసానికి వెళ్ళి తేనీరు సేవించి నియోజకవర్గ రాజకీయ పరిస్థితులపై చర్చించారు. ఈకార్యక్రమంలో వైసిపి నాయకులు , ఎంపిటిసి సభ్యులు పల్లాల కొండారెడ్డి, మాజీ ఎంపిటిసి సభ్యులు తాటిచెట్ల కాలేషా,నాయకులు వనిపెంట సుబ్బారెడ్డి , లింగాలదిన్నె రవీంద్రారెడ్డి, కాటం రమణారెడ్డి, భూమిరెడ్డి పెంచలరెడ్డి, నాగిరెడ్డి, భూమిరెడ్డి నర్సింహారెడ్డి, జయన్న, జయంతిరెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## తాత్కాలిక వార్డు సచివాలయ భవనం ప్రారంభించిన జిల్లా ప్రజాపరిషత్ చైర్‌పర్సన్



**నెల్లూరు అర్బన్,మే10,ప్రభాతవార్త** జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మరియు డిసిసిబి మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి చింతారెడ్డిపాలెం 12/2 వార్డు సచివాలయం ఏసీ సుబ్బారెడ్డి భవనం నందు తాత్కాలికంగా ప్రారంభించడం జరిగింది.ఈ సందర్భంగా విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ త్వరలోనే నూతన సచివాలయ భవనం శంకుస్థాపన చేయడంజరుగుతుందని చెప్పారు.సచివాలయ సిబ్బంది అందరూ ప్రజలకు అందుబాటులో ఉండి ప్రభుత్వం సంక్షేమ పథకాలును అర్హులైన అందరికీ అందే విధంగా చూడాలని సూచించారు.త్వరలో పూర్తిస్థాయి సిబ్బందిని నియమించే విధంగా అధికారుల దృష్టికి తీసుకెళ్తారని చెప్పడం జరిగింది. సచివాలయ సిబ్బంది,చింతారెడ్డి పాలెం వైసీపీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేషన్ ఉద్యోగులకు సూపరింటెండెంట్‌లుగా పదోన్నతి





**నెల్లూరు కార్పొరేషన్,మే10,ప్రభాతవార్త** నెల్లూరు కార్పొరేషన్‌లో లీగల్ సెల్ విభాగం,పరిపాలన విభాగాలలో సీనియర్ అసిస్టెంట్‌లుగా పనిచేస్తున్న ఎ.ప్రవీణ్,వై.చెంచయ్యలకు సూపరింటెండెంట్‌లుగా పదోన్నతులు కల్పిస్తూ కమిషనర్ వికాస్ మర్మత్ బుధవారంఉత్తర్వులు జారీ చేశారు.ఈ సందర్భంగా కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్‌లో ఆయన చేతులమీదుగా వారు ఉత్వర్వులు అందుకున్నారు.

## కారు ఢీ కోని ఉపాధి కూలీ మృతి



**రాపూరు,మే10ప్రభాతవార్త** ఉపాధి పథకం పనికి వెల్లి తిరిగి వస్తుండుగా వేగంగా వస్తున్న కారు ఢీ కోని రాపూరు మండలం పంగిలిగ్రామానికి చెందిన మల్లి అంకమ్మ(35) బుదవారం మృతి చెందింది. ఇందుక సంబందించిన వివరాలు ఇలా వున్నాయి.పంగిలి గ్రామానికి చెందిన పలువురు ఉపాధి హామీ పథకం పనికి వెల్లి తిరిగి వస్తుండుగా చిట్వేలి నుండి రాపూరువైపు వస్తున్న కారు పంగిలి చెక్ పోస్ట్ వద్ద ఉపాధి కూలీ అంకమ్మను వేగంగా ఢీ కోనడంతో ఆమె అక్కడికక్కదే మృతిచెందింది. ఈ మేరకు కేసు నమొదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కాంతి కుమార్ తెలిపారు.

## పేద ప్రజల సంక్షేమమే సియం జగన్ మోహన్ రెడ్డి లక్ష్యం



యంవిపురం(రాపూరు),మే10ప్రభాతవార్త రాష్టంలోని పేద ప్రజల అభివృద్ధి,సంక్షేమమే రాష్ట ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమనితిరుపతి జిల్లా వైసిపి ఆధ్యక్షుడు,రాష్ట కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు చైర్మన్,వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్తనేదురుమల్లి రాంకుమార్ రెడ్డి తెలిపారు. బుదవారం రాపూరు మండలంలోని గిలకపాడు సచివాలయం పరిధిలోనియంవిపురం పంచాయితీలో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగాఆయన యంవిపురం,చుట్టుపాళెం గ్రామాలలో పర్యటించి అభివృద్ధి,సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను ప్రజలకు ఆందజేశారు.పేద ప్రజల అభ్యున్నతి కోరకు అనేక అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను అవినీతి లేకుండా ప్రజలకు అందిస్తున్నముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఆశీర్వదించి మరో సారి వచ్చే ఎన్నికలలో ఆయనను ముఖ్యమంత్రినిచేయాలని కోరారు. ఈ సందర్బంగా గ్రామాలలో ప్రజలు చెప్పిన పలు సమస్యలు ఆయన సావధానంగా వినివెంటనే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబందింత అదికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలోసినియర్ వైసిపి నాయకులు పాపకన్ను దయాకర్ రెడ్డి, మండల జెసిఎస్ కన్వినర్ దందోలు లక్ష్మీనారాయణ రెడ్డి, యంవిపురం సర్పంచ్ మునగాల జగధీష్,వైసిపి నాయకులు మునగాల విజయ్,కేతా అనీల్ రెడ్డి, పలు గ్రామాలకుచెందిన వైసిపి నాయకులు,స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు,మండలంలోని అన్ని శాఖల అధికారులు వున్నారు.